వీలేకరులు కావలెను

తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా వెలుబడుతున్న

ప్రజా స్వేచ్ఛ

PRAJA SWECHA

రాజకీయ, సామాజిక, సంస్కృతిక, మాసపత్రిక

తెలుగు మాసపత్రిక నందు పనిచేయుటకు
జర్నలిజంపై ఆసక్తి కలిగిన ప్రతి మండలం నుండి విలేఖరులు కావలెను

ఆసక్తి గలవారు సంప్రదించండి
+91 9381910611 , 7989289492



www.prajaswecha.com

# ప్రజా స్వేచ్ఛ


PRAJA SWECHA

రాజకీయ, సామాజిక, సంస్కృతిక, మాసపత్రిక





| హైదరాబాద్ | సంచిక : 1 | సంపుటి : 136 | ఎడిటర్ : తరిగొప్పుల లక్ష్మి మహేందర్ ప్రజాపతి | నవంబర్ 2024 | వెల : రూ 10/- |
|---|---|---|---|---|---|

## అనలాగ్ స్పేస్ మిషన్‌ను ప్రారంభించిన ఇస్రో

- ఇస్రో ప్రారంభించిన తొలి భారీ అనలాగ్ మిషన్ ఇదే
- బేస్ స్టేషన్లలో ఎదురయ్యే సమస్యలను ఎదుర్కొనేందుకు సన్నాహాలు

న్యూఢిల్లీ,

భారత అంతరిక్ష సంస్థ ఇస్రో తొలి అనలాగ్ స్పేస్ మిషన్‌ను లద్దాఖ్ లేహ్‌లో ప్రారంభించింది. హ్యూమన్ స్పేస్ ఫ్లైట్ సెంటర్, ఆకా స్పేస్ స్టూడియో, లడఖ్ విశ్వవిద్యాలయం, ఐఐటీ బాంబే, లడఖ్ అటానమస్ హిల్ డెవలప్‌మెంట్ కౌన్సిల్ సహకారంతో ఈ మిషన్ చేపట్టింది. మిషన్‌లో భాగంగా ఇస్రో లేహ్‌లో ఓ స్పేస్‌ను సృష్టిస్తుంది. ఇందులో మరో గ్రహంలో పరిస్థితులు ఎలా ఉంటాయో

-మిగతా 2లో



## స్టూడెంట్స్ కి గుడ్ న్యూస్

- 40శాతం డైట్ కాస్మోటిక్ ఛార్జీల పెంపు
- గత బిఆర్ఎస్ ప్రభుత్వం ఏనాడు పట్టించుకోలేదు
- మీడియా సమావేశంలో మంత్రి సీతక్క వెల్లడి

హైదరాబాద్,

తెలంగాణలో గురుకులాలకు డైట్, కాస్మోటిక్ ఛార్జీలు పెరిగాయి. 40శాతం మేర పెంచినట్లు మంత్రి సీతక్క వెల్లడించారు. ఎన్నడు లేని విధంగా హాస్టల్, గురుకుల విద్యార్థులకు డైట్ కాస్మోటిక్ 40శాతం పెంచారని గుర్తుచేశారు. శుక్రవారం సచివాలయంలో మంత్రి సీతక్క మీడియా సమావేశంలో మాట్లాడుతూ... ఎన్నడూ లేని విధంగా విద్యార్థులకు 40శాతం చార్జీలను పెంచిన సీఎం రేవంత్‌రెడ్డికి ధన్యవాదాలు తెలిపారు. పెంచిన చార్జీలు

-మిగతా 2లో



## భారత ఆర్థిక వేత్త బిబేక్ ఇకలేరు

- ఆర్థిక విధానాల రూపకల్పనలో కీలకపాత్ర
- సంతాపం తెలిపిన ప్రధాని మోదీ

న్యూఢిల్లీ,

ప్రముఖ ఆర్థికవేత్త, ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ఆర్థిక సలహా మండలి ఛైర్మన్ బిబేక్ దెబ్రాయ్ కన్నుమూశారు. ప్రస్తుతం ఆయన వయసు 69. అనారోగ్యంతో చికిత్స పొందుతూ శుక్రవారం ఉదయం 7 గంటలకు ఆయన మరణించినట్లు ఢిల్లీ ఎయిమ్స్ తెలిపింది. దెబ్రాయ్ మరణం పట్ల ప్రధాని మోదీ సంతాపం వ్యక్తం

-మిగతా 2లో

## రాష్ట్రమంతటా పాదయాత్ర




- ప్రజల్లో కాంగ్రెస్ ప్రభుత్వంపై వ్యతిరేకత
- రైతులను నట్టే ముంచి ..డైవర్షన్ పాలిటిక్స్
- వ్యతిరేతను ప్రజల్లోకి తీసుకుని వెళ్లే ఆలోచన
- అవసరమైతే పాదయాత్ర చేస్తామన్న కేటీఆర్

హైదరాబాద్,

ప్రజల్లో ప్రభుత్వ వ్యతిరేకత ఉందని, రాజకీయంగా తమకు అనుకూలంగా ఉందిన విపక్ష బిఆర్ఎస్ భావిస్తోంది. దీనిని తమకు అనుకూలంగా మలచుకునేందుకు ప్రజల్లోకి చొచ్చుకు వెళ్లాలని నిర్ణయించింది. ప్రభుత్వ కార్యక్రమాలకు వ్యతిరేకంగా పోరాటం చేయాలని

-మిగతా 2లో



## ఒక్క అంగుళం భూమిని వదులుకోం

- సైనిక దళాన్ని బలోపేతం చేస్తున్నాం
- అత్యాధునిక సైనిక జబితాలో చేర్చుతున్నా ప్రధాని మోదీ

న్యూఢిల్లీ,

భారత్–చైనా సరిహద్దులో బలగాల ఉపసంహరణ నేపథ్యంలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఆసక్తికరమైన వ్యాఖ్యలు చేశారు. ప్రస్తుతమున్న కేంద్ర ప్రభుత్వం దేశానికి సంబంధించిన ఒక్క అంగుళం భూమి విషయంలో కూడా రాజీపడబోమని ఆయన వ్యాఖ్యానించారు. “21వ శతాబ్దపు అవసరాలను దృష్టిలో ఉంచుకుని మనం మన సైన్యాలను, మన భద్రతా దళాలను

-మిగతా 2లో

## జార్ఖండ్‌లో పొత్తులే కీలకం



- గిరిజన రాష్ట్రంలో పట్టు కోసం పోరాటం
- కాంగ్రెస్ కూటమితో పటిష్టంగా జెఎంఎం
- జెఎంఎం సహకారం లేకుండా ఏమీ చేయలేని స్థితిలో కాంగ్రెస్
- మరోమారు అధికారం కోసం బీజేపీ యత్నం

రాంచీ,

ఒకప్పుడు కాంగ్రెస్ కంచుకోటగా ఉన్న జార్ఖండ్‌లో ఇప్పుడు పాలక జెఎంఎం సహకారం లేకుండా ఏమీ చేయలేని స్థితిలోకి కాంగ్రెస్ పార్టీ వెళ్లిపోయింది. సర్ఫరాజ్ అహ్మద్, సుబోధ్ కాంత్ సహాయ్, ఫుర్కాన్ అన్సారీ,

-మిగతా 2లో

## మాది మంచి ప్రభుత్వమే..కానీ మెతక కాదు

- శాంతిభద్రతల విషయంలో రాజీపడేది లేదు
- వైకాపా తీరును సహించే ప్రసక్తి లేదు
- షర్మిల రక్షణ కోరితే తప్పకుండా అండగా ఉంటాం
- ఇచ్చిన హామీలన్నీ అమలు చేస్తూ పోతాం
- ఏలూరు జిల్లాలో ఉచిత దీపం పథకం ప్రారంభించిన పవన్ కళ్యాణ్

ఇష్టం వచ్చినట్లు వ్యవహరిస్తే ఊరుకునేది లేదు



ఏలూరు,

గత ప్రభుత్వ హయాంలో సంక్షేమ పథకాలు సరిగా అమలు చేయలేదు.. కుటమి ప్రభుత్వం సంక్షేమ పథకాలు సక్రమంగా అమలు చేసి చూపుతోందని డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ అన్నారు. దీపం పథకం కింద ఏడాదికి 2,684 కోట్లు, ఐదేళ్లకు13,425 కోట్లు ఖర్చు చేస్తుందని తెలిపారు. దీపం ఉచిత సిలిండర్లు కోటి ఎనిమిది లక్షల మందికి ఇవ్వబోతున్నామని

-మిగతా 2లో

## టిజి ఆర్టీసీ కీలక నిర్ణయం

- కార్గో సేవల విస్తరణపై దృష్టి
- పార్శిళ్లు నేరుగా ఇంటికి చేర్చనున్నట్లు ప్రకటన

హైదరాబాద్,

తెలంగాణ రోడ్డు రవాణా సంస్థ మరో కీలక నిర్ణయం తీసుకుంది. సంస్థ నిర్వహిస్తున్న కార్గో సేవల ద్వారా బుక్ చేసుకున్న పార్సిళ్లను నేరుగా హోమ్ డెలివరీ చేయాలని నిర్ణయంచింది. దీపావళి పండగ సందర్భంగా

-మిగతా 2లో

# జార్ఖండ్‌లో పొత్తులే కీలకం

(మొదటి తరువాయి)

రాజేందర్ సింగ్, చంద్రశేఖర్ దూబే వంటి నాయకులతో కలకలలాడిన కాంగ్రెస్ ఇప్పుడు బలం తగ్గిఉంది. పొత్తులు ఫలించడం, సంక్షేమ పథకాలు సానుకూలించడంతోపాటు సోరెన్ అరెస్టుతో రాష్ట్రంలో వ్యక్తమైన సానుభూతి పాలక 'జెఎంఎం', 'ఇండియా' కూటమికి కలసి వస్తోందని భావిస్తున్నారు. బిజెపికి బయపడి, పార్టీ మార్పిళ్ల నుంచి కాపాడుకోవడానికి సిఎం తమ ఎంఎల్ఎలను రెండు మార్లు ఛత్తీస్‌గఢ్‌లో క్యాంపుల్లో పెట్టాల్సి వచ్చింది. ఇకపోతే 2019లో చేజారిన జార్ఖండ్‌ను తిరిగి పొందడానికి బిజెపి ఆదివాసీల మనసు గెలిచే సకల యత్నాలూ చేస్తోంది. జెఎంఎం బలంపై గట్టిగా దెబ్బకొట్టాలనే పట్టుదలతో పని చేస్తోంది. చేసిన తప్పును సరిదిద్దుకుంటున్న భావన జార్ఖండ్ ప్రజల్లోకి వెళ్లేలా, బిజెపి గెలిస్తేఊ డబుల్ ఇంజిన్ సర్కార్‌తో అభివృద్ధి సాగుతుందని ప్రచారంలో చెబుతున్నారు. ఆదివాసీయేతర నాయకుడు రఘుబర్దాస్‌ని ముఖ్యమంత్రి చేసి ఆదివాసీల కోపానికి కారణమైనట్టు పార్టీ నాయకత్వం గ్రహించింది. అలాగే హేమంత్ సోరెన్ పై కేంద్ర దర్యాప్తు సంస్థల కేసు, అరెస్టుతో అది మరింతగా బలపడి, బిజెపి ఆదివాసీలకు వ్యతిరేకం అన్న భావన కలిగింది. అయితే ముర్మను రాష్ట్రపతిని చేయడం కొంత కలసి వస్తోంది. జార్ఖండ్‌లో ఏ కూటమినైనా.. అంతిమంగా పొత్తులే గట్టెక్కించాలి. ఏ ఒక్కరూ సొంతంగా ప్రభుత్వం ఏర్పాటు చేయగల ప్రజామద్దతు కూడగట్టే స్థితిలో లేరు. పొత్తుల్లో గెలిచి ప్రభుత్వాలు ఏర్పరచడం, విడిగా పోటీ చేసినపుడు ఓడి విపక్షంలో కూర్చోవడం.. ఈ అనుభవం ఇటు బిజెపి, అటు జెఎంఎం ఇద్దరికీ ఉంది. అందుకే పొత్తుల్ని ఖరారు చేసుకొని కూటమిగానే బరిలో దిగుతున్నారు. 81 స్థానాలున్న రాష్ట్రంలో ప్రభుత్వం ఏర్పాటు చేయడానికి అవసరమైన మ్యాజిక్ నంబర్ 41. పార్టీల మధ్య పొత్తుతో పాటు సామాజిక సమీకరణాలపైన దృష్టిపెట్టి, గెలుపే లక్ష్యం చేసుకుంటున్నారు. 2014లో విడిగా పోటీచేసి 25స్థానాలు గెలిచిన జెఎంఎం, కాంగ్రెస్‌లు 2019 ఎన్నికల్లో కలిసి పోటీచేసి 47 స్థానాలు గెలిచి, ప్రభుత్వం ఏర్పరిచారు. 2014లో ఆల్ జార్ఖండ్ స్టూడెంట్స్ యూనియన్ (ఎజెఎస్‌యు)తో పొత్తు పెట్టుకొని 42 సీట్లు నెగ్గిన బిజెపి, 2019లో పొత్తులు బెడిసి 25 సీట్లకు పరిమితమైంది. ప్రభుత్వం పోయింది. 16శాతం జనాభాగా ఉన్న కుర్మీ మహతోల్లో పట్టున్న ఎజెఎస్‌యు కనీసం 14 అసెంబ్లీ సీట్లలో ప్రభావం చూపుతుంది. రాష్ట్రంలోని 7 జిల్లాలు, 20 సీట్లలో ప్రభావం గల ముస్లింలు సుమారు 15 శాతంగా ఉన్నారు. ఒబిసి జనాభా 46శాతం ఉంది. అందుకే, బిజెపి(68), ఎజెఎస్‌యు(10), జెడి(యు)(2), ఎల్‌జెపి(1) కలిసి పోటీ చేయాలని సయోధ్యతో ఉన్నాయి. 'ఇండియా' కూటమిలోనూ సీట్ల పంపకాలు జరిగినా.. మూడు స్థానాల్లో మిత్రపక్షాల అభ్యర్థులే పరస్పరం పోటీలో ఉండే పరిస్థితి తలెత్తింది. జెఎంఎం (43), కాంగ్రెస్ (30), రాష్ట్రీయ జనతాదళ్ (ఆర్‌జెడి)(5), సిపిఐ-ఎంఎల్ (3) పార్టీలు కలిసి మొత్తం 81 స్థానాల్లో పోటీ చేయాలనుకున్నారు. కానీ, కాంగ్రెస్‌కు కేటాయించిన రెండు సీట్లలో ఆర్‌జెడి, సిపిఐ-ఎంఎల్‌కు కేటాయించిన ఒక చోట కాంగ్రెస్.. పొత్తులకు విరుద్ధంగా పోటీలో దిగుతున్నాయి. ఇన్ని సంక్లిష్టతల మధ్య జార్ఖండ్ గెలుపు ఎవరిని వరించనున్నదో నవంబరు 23 న తేలనుంది.

# రాష్ట్రమంతటా పాదయాత్ర

(మొదటి తరువాయి)

భావిస్తోంది. ఇందులో భాగంగా కెటిఆర్ పాదయాత్ర ఆలోచన చేస్తున్నారు. అలాగే కార్యకర్తల ఆకాంక్షల మేరకు భవిష్యత్తులో రాష్ట్రవ్యాప్తంగా పాదయాత్ర చేస్తానని పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ తెలిపారు. పార్టీ కార్యకర్తలు అంతా కోరుతున్నందున భవిష్యత్తులో రాష్ట్రవ్యాప్తంగా పాదయాత్ర చేస్తానని కేటీఆర్ అన్నారు. ఎక్స్ వేదిగా నిర్వహించిన 'ఆస్క్ కేటీఆర్' క్యాంపెయిన్‌లో యూజర్లు అడిగిన పలు ప్రశ్నలకు సమాధానం ఇచ్చారు. దేశంలోని అనేక పార్టీల నేతలు ప్రభుత్వాల వైఫల్యాలను ఎండగట్టడంతోపాటు, పార్టీలను బలోపేతం చేసేందుకు పార్టీ అధ్యక్షులు పాదయాత్రలు చేస్తున్నారు, మీరెప్పుడు చేస్తారని అడిగారు. దీనికి స్పందించిన కేటీఅర్ ఖచ్చితంగా తన పాదయాత్ర ఉంటుందని వెల్లడించారు. దాదాపు గంటన్నపాటు సాగిన ఈ సంభాషణలో కేటీఆర్ అనేక అంశాలపై తన అభిప్రాయాలను పంచుకున్నారు. కాంగ్రెస్ పాలన తెలంగాణకు ఒక శాపంగా మారిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చే ఉద్దేశం ఏమాత్రం లేదు. అందుకే అబద్దాలు, అసత్యాల మీద సమయం గడుపుతూ ప్రజలను మోసం చేస్తున్నది. గత పది నెలల కాలంలో కాంగ్రెస్ పార్టీ చేసిన ఒక్క మంచి కూడా గుర్తుకు రావడం లేదు. అబద్ధపు హామీల మీద ఎన్నికైన కాంగ్రెస్ పార్టీ నుంచి ఇంతకంటే గొప్ప పరిపాలన ఆశించలేం. తమ వైఫల్యాలను కప్పిపుచ్చుకునేందుకు రాజకీయ వేధింపులను ప్రారంభించింది. అయితే వీటికి భయపడేది లేదని కేటీఆర్ స్పష్టం చేశారు. సన్నవడ్లకు కూడా బోనస్ ఇస్తామన్న కాంగ్రెస్ పార్టీ హామీ బోగస్‌గా మారిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వాన్ని నమ్మి ఓట్లు వేసి మద్దతు ధర లేక రైతుబంధు లేక నష్టపోతున్న రైతన్నల తరఫున పోరాడుతామని చెప్పారు. కాంగ్రెస్ పార్టీ పాలన ఫ్రమ్ ఢిల్లీ, టూ ఢిల్లీ, ఫర్ డీల్లీ అన్నట్లుగా తయారైందని ఎద్దేవా చేశారు. నాలుగేండ్ల తర్వాత కాంగ్రెస్ పార్టీ అధికారం పోవడం ఖాయమని కేటీఆర్ అన్నారు. అయితే కొత్త ప్రభుత్వానికి ప్రస్తుత సర్కార్ చేసిన నష్టం నుంచి తెరుకొని ముందుకు తీసుకుపోవడం అతిపెద్ద సవాలుగా మారుతుందని చెప్పారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్ర ఆర్థిక ప్రగతి పూర్తిగా పతనమైందని చెప్పారు. అన్ని రంగాల్లో తెలంగాణ రాష్ట్రం వెనక్కి పోతున్నదని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర ఆదాయ వనరులు నుంచి మొదలు వ్యవసాయ రంగం, అన్ని రంగాలు తిరోగమనంలో ఉన్నాయన్నారు. నిరుద్యోగిత పెరిగిందన్నారు. తెలంగాణ నుంచి అనేక కంపెనీలు వెనక్కి వెళ్లిపోతున్నాయని చెప్పారు. ఈ అంశాల్లో రాష్ట్ర ప్రభుత్వానికి ఎలాంటి ప్రణాళికలు ఉన్నాయో ఎవరికీ తెలియడం లేదన్నారు. కాంగ్రెస్ పాలన వలన జరుగుతున్న నష్టాన్ని పూడ్చుకోవడం అప్పుడప్పుడే సాధ్యం కాదు అన్నారు. కాంగ్రెస్ దళారీ ప్రభుత్వం రైతులను నిండా ముంచిందని కేటీఆర్ ఆరోపించారు. అకాల వర్షాలకు ధాన్యం తడవడం, పంట కొనుగోళ్లపై ఆయన స్పందించారు. వానాకాలం వరికోతలు సాగుతున్నప్పటికీ.. రైతుబంధు, రైతుభరోసా ఊసే లేదని ఆక్షేపించారు. కనీసం పంట కొనుగోలు చేయడం లేదని.. దీంతో రైతులు నానా ఇబ్బందులు పడుతున్నారన్నారు. అకాల వర్షాలకు చాలాచోట్ల కల్లాల్లో, మార్కెట్ యార్డుల్లో ధాన్యం తడిసిందని పేర్కొన్నారు. ఈ సీజన్లో 91 లక్షల 28 వేల టన్నుల ధాన్యాన్ని సేకరిస్తామని చెప్పి.. అక్టోబర్ 28 వరకు 913 మంది రైతుల నుంచి కేవలం 7,629 టన్నుల ధాన్యాన్ని మాత్రమే కొనుగోలు చేశారని తెలిపారు. 'రైతన్న అంటే ఎంత నిర్లక్ష్యమో చూడండి' అని వ్యాఖ్యానించారు. దళారులతో కుమ్మక్కైన కాంగ్రెస్ ప్రభుత్వం ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటుచేయడం లేదని.. ఇప్పటివరకు పూర్తిస్థాయిలో మిల్లుల కేటాయింపు జరగలేదని కేటీఆర్ విమర్శించారు. సేకరించిన ధాన్యాన్ని ఏ మిల్లుకు పంపాలో తెలియక ఐకేపీ కేంద్రాల్లోను కొనుగోలు ప్రక్రియ నిలిచిందన్నారు. కనీసం పండించిన చేసిన పంటను కొనుగోలు కూడా చేయడం లేదని.. ఫలితంగా రైతులు నానా ఇబ్బందులు పడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అకాల వర్షాలకు చాలా చోట్ల కల్లాలలో, మార్కెట్ యార్డుల్లో ధాన్యం తడిసి ముద్దయ్యిందని పేర్కొన్నారు. ఈ సీజన్‌లో 91.28 లక్షల టన్నుల ధాన్యాన్ని సేకరిస్తామన్నారని.. అక్టోబర్‌లో నెలలో 8.16 లక్షల టన్నుల ధాన్యం కొనుగోలు చేయాలని పౌరసరఫరాల శాఖ లక్ష్యంగా పెట్టుకుందని గుర్తు చేశారు. అక్టోబర్ 28 నాటికి వరకు 913 మంది రైతుల నుంచి కేవలం 7,629 టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేశారని.. దాన్ని బట్టి రైతన్న అంటే ఎంత నిర్లక్ష్యమో ప్రజలు చూడాలన్నారు. దళారులతో కుమ్మక్కు అయిన ఈ కాంగ్రెస్ ప్రభుత్వం ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయడం లేదని.. నేటి వరకు పూర్తి స్థాయిలో మిల్లుల కేటాయింపు జరగనేలేదని ఆరోపించారు. కొనుగోలు కేంద్రాల ద్వారా సేకరించిన ధాన్యాన్ని ఏ మిల్లుకు పంపాలో తెలియక.. ప్రారంభించిన ఐకేపీ కేంద్రాల్లోను కొనుగోలు పక్రియ నిలిచిందన్నారు. రైతులు కల్లాల్లో కన్నీళ్లు పెడుతుంటే... ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మాత్రం డైవర్షన్ పాలిటిక్స్‌లో బిజిబిజీగా ఉన్నారని కేటీఆర్ ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణకు శాపంగా మారిందని ఆయన అన్నారు. ప్రస్తుత పాలన ఫ్రం దిల్లీ, టూ దిల్లీ, ఫర్ దిల్లీ అన్నట్లుగా తయారైందని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ పార్టీ పాలనలో జరిగిన పతనం నుంచి తెలంగాణ కోలుకోవడం అసాధ్యమని చెప్పారు. ప్రజలపక్షాన కొట్లాడటమే ప్రస్తుతం తమముందున్న బాధ్యత అని పేర్కొన్నారు. వచ్చే ఎన్నికల్లో భారాస తిరిగి అధికారంలోకి రావడం ఖాయమని ధీమా వ్యక్తంచేశారు. 'పార్టీ కార్యకర్తలు అంతా కోరుతున్నందున కచ్చితంగా రాష్ట్రవ్యాప్తంగా విస్తృతస్థాయి పాదయాత్ర నిర్వహిస్తానని అన్నారు. కేసీఆర్ సంపూర్ణ ఆరోగ్యంతో ఉన్నారు. పార్టీకీ మార్గదర్శనం చేస్తున్నారు. పార్టీ నేతలపై వేధింపులు,అక్రమ కేసులు పెడుతున్న పోలీసులపై కఠిన చర్యలు తీసుకుంటామని అన్నారు. రాష్ట్రంలో శాంతి భద్రతలు పూర్తిగా క్షీణించాయి. మా సోషల్ మీడియా వారియర్లు అద్భుతంగా పని చేస్తున్నారని కేటీఆర్ తెలిపారు.

## స్టూడెంట్స్ కి గుడ్ న్యూస్

(మొదటి తరువాయి)

అందుకుబోతున్న విద్యార్థులందరికీ శుభాకాంక్షలు తెలిపారు. ఇదే విద్యార్థులకు అసలైన దీపావళి అని మంత్రి సీతక్క వ్యాఖ్యానించారు. ఇక హాస్టల్ విద్యార్థులు అర్థాకలితో అవస్థలు పడాల్సిన అవసరం లేదని చెప్పారు. పెంచిన చార్జీలతో విద్యార్థులకు పోషకాహారం అందించాల్సిన బాధ్యత టీచర్లది, హాస్టల్ సిబ్బందిది అని తెలిపారు. హాస్టల్ విద్యార్థులకు డైట్, కాస్మోటిక్ చార్జీలు గ్రీన్ ఛానల్ ద్వారా చెల్లిస్తామని మంత్రి సీతక్క హామీ ఇచ్చారు.డైట్ చార్జీలు ఏడేళ్లుగా, కాస్మోటిక్ చార్జీలు గత 16 సంవత్సరాలుగా పెరగలేదని అన్నారు. ఏడు సంవత్సరాల క్రితం డైట్ చార్జీలు కొంచెం పెంచి.. బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రచారం చేసుకుందని మంత్రి సీతక్క మండిపడ్డారు. బీఆర్ఎస్ హయాంలో విద్యా వ్యవస్థ నాశనమైందని మంత్రి డాక్టర్ ధనసరి అనసూయ సీతక్క విమర్శలు చేశారు. విద్యా శాఖకు కేసీఆర్ ప్రభుత్వం చేసింది శూన్యమని విమర్శించారు. విద్యార్థుల బాధలు తెలిసిన రేవంత్ రెడ్డి సీఎంగా ఉన్నారని తెలిపారు. విద్యార్థులకు మంచి భవిష్యత్తు ఉండాలనే లక్ష్యంతో రేవంత్ రెడ్డి పనిచేస్తున్నారని ఉద్ఘాటించారు. ఏడేళ్లుగా ధరలు విపరీతంగా పెరిగాయని.. అందుకు అనుగుణంగా డైట్, కాస్మోటిక్ ఛార్జీలు ఎందుకు పెంచలేదని ప్రశ్నించారు. డైట్, కాస్మోటిక్ ఛార్జీలు పెంచకపోవడంతో పిల్లలు అర్ధాకలితో ఇబ్బందులు పడ్డారని ఆవేదన వ్యక్తం చేశారు. పదేళ్లు కేసీఆర్ అధికారంలో ఉండి టాయిలెట్స్ కట్టలేదని..తాగునీరు, మౌలిక వసతులు కల్పించలేదని ధ్వజమెత్తారు. ఈ సమస్యలను గుర్తించిన సీఎం రేవంత్ రెడ్డి పాఠశాలల్లో మౌలిక సదుపాయల కల్పన కోసం ప్రత్యేక దృష్టి పెట్టారని మంత్రి సీతక్క అన్నారు. డైట్, కాస్మోటిక్ చార్జీలు పెంచడంతో 7.65 లక్షల మంది విద్యార్థులకు లబ్ది జరగనుందని వివరించారు.పిల్లలకు కడుపునిండా భోజనం పెట్టాలని పెరిగిన ధరలకు అనుగుణంగా డైట్, కాస్మోటిక్ చార్జీలను పెంచిన సీఎం రేవంత్‌రెడ్డికు ధన్యవాదాలు తెలిపారు.

## మాది మంచి ప్రభుత్వమే..కానీ మెతక కాదు

(మొదటి తరువాయి)

పవన్ కళ్యాణ్ ప్రకటించారు. ఏలూరు జిల్లా ద్వారక తిరుమల మండలం ఐఎస్ జగన్నాథపురంలో డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ దీపం పథకం ప్రారంభించారు. ఈ సందర్భంగా అక్కడ ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ఆయన ప్రసంగించారు. 14 ఏళ్ల క్రితం ఐఎస్ జగన్నాథపురం ఆలయానికి వచ్చాను.. ఇక్కడ స్వయంభుగా వెలసిన లక్ష్మీనరసింహ స్వామిని ఎప్పుడు రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని కోరుకుంటానని చెప్పారు. లక్ష్మీ నరసింహస్వామి 14 ఏళ్ల పరీక్ష పెట్టాడు.. గతంలో ఎదురైన ఓటమితో జీవితం అంధకారం అయ్యింది.. అలాంటి సమయంలో జనసైనికులతో పాటు ధైర్యం ఇచ్చింది లక్ష్మీనరసింహస్వామి అని పవన్ కళ్యాణ్ అన్నారు. దీపం పథకం కేవలం వంటింట్లో వెలగడానికే కాదు.. పేదల ఆకలి తీర్చడానికి అని తెలిపారు. ఐఎస్ జగన్నాథపురం ఆలయానికి రూ.200 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టబోతున్నామని పేర్కొన్నారు. ఇచ్చిన హామీలన్నీ పక్కాగా అమలు చేస్తాం.. హామీలు అమలు చేయకపోతే జనసైనికుల ప్రేమ ఎంత బలంగా ఉంటుందో కోపం కూడా అంతే బలంగా ఉంటుందని చెప్పారు. పదవి వచ్చాక పదింతలు ఎక్కువగా కష్టపడే వ్యక్తిని అని అన్నారు. అభిమానులు సినిమా పేర్లు జపించడం కంటే భగవన్నామస్మరణ చేస్తే ఇంకా బాగుంటుంది.. సినిమాలో ఒక సరదా మాత్రమే.. సినిమాలు ఉండాలని అన్నారు. వైసీపీ చేసిన తప్పుడు విధానాల వల్ల వ్యవస్థ పాడయింది.. వైసీపీ ఓడి 11 సీట్లు మిగిలినా వాళ్ళ నోళ్లు మూతపడటం లేదు.. వైసీపీ నేతలకు చింత చచ్చినా పులుపు చావలేదు. వైసీపీకి 11సీట్లువచ్చినా విమర్శలు మానలేదు. మూడు నెలలుగా వైసీపీ నేతలకు నోరు ఎక్కువైంది. ఇది మంచి ప్రభుత్వమే కానీ, మెత్తని ప్రభుత్వం కాదు. మీకు యుద్ధమే కావాలనుకుంటే సిద్ధమే.. కానీ అభివృద్ధికి ఉపయోగపడే యుద్ధం కావాలి. ఆడబిడ్డలకు ఆపద కలిగించినా, చాలా తీవ్రంగా పరిగణిస్తాం. నేరాలు పెరిగాయి, శిక్షలు తగ్గాయి.

## ఒక్క అంగుళం భూమిని వదులుకోం

(మొదటి తరువాయి)

ఆధునిక వనరులతో బలోపేతం చేసుకుంటున్నాం. ప్రపంచంలో అత్యాధునిక సైన్యాల జాబితాలో చేర్చుతున్నాం. ఈ ప్రయత్నాలకు ఆధారం రక్షణ రంగంలో స్వావలంబన" అని నరేంద్ర మోదీ అన్నారు. గుజరాత్‌లోని కచ్ఛ్‌లో ఉన్న సర్ క్రీక్ ప్రాంతంలోని లక్కీ నాలా వద్ద బీఎస్ఎఫ్, ఆర్మీ, నేవీ, వైమానిక దళ సిబ్బందితో ఇవాళ (గురువారం) ఆయన దీపావళిని జరుపుకున్నారు. "నేడు అభివృద్ధి చెందిన దేశంగా అవతరించడమే లక్ష్యంగా వేగంగా ముందుకు సాగుతున్న వేళ మీరందరూ (సైనికులు) ఈ కలల రక్షకులు" అని మోదీ అన్నారు. కాగా తూర్పు లడఖ్ దగ్గర చైనా-భారత్ బలగాల ఉపసంహరణ ప్రక్రియ దాదాపు పూర్తవుతున్న నేపథ్యంలో ప్రధానమంత్రి మోదీ ఈ వ్యాఖ్యలు చేశారు. కాగా సరిహద్దు పర్యాటకం జాతీయ భద్రతకు సంబంధించిన అంశమని, దీని గురించి పెద్దగా చర్చించలేదని మోదీ అన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ ఎప్పటిలాగానే ఈ సంవత్సరం కూడా దీపావళి పండగను సైనికుల మధ్య జరుపుకున్నారు. ఇందుకోసం ఆయన ఈ రోజు (గురువారం) గుజరాత్‌లోని కచ్ఛ్‌లో సర్ క్రీక్‌లోని లక్కీ నాలా వద్ద బీఎస్ఎఫ్, ఆర్మీ, నేవీ, ఎయిర్ ఫోర్స్ సిబ్బందిని కలిశారు. ఆర్మీ యూనిఫాం ధరించి సైనికులతో గడిపారు. అక్కడున్న సైనికులకు ఆయన పండుగ శుభాకాంక్షలు తెలిపారు. సైనికులకు స్వీట్లు పంచిపెట్టారు.

## అనలాగ్ స్పేస్ మిషన్‌ను ప్రారంభించిన ఇస్రో

(మొదటి తరువాయి)

అలాగే ఉంటాయి. దాంతో భూమికి దూరంగా ఉన్న ప్రదేశాల్లోని బేస్ స్టేషన్లలో ఎదురయ్యే సమస్యలను ఎదుర్కొనేందుకు ఇస్రో సన్నాహాలు చేయనున్నది. ఇస్రో లేహ్‌లో ప్రారంభించిన తొలి భారీ అనలాగ్ మిషన్ మిషన్ ఇదే. అంతరిక్షం, ఏదైనా ఖగోళ వస్తువు తరహాలో వాతావరణం, పర్యావరణాన్ని పోలి ఉంటుంది. నిర్ణీత ప్రమాణాలకు అనుగుణంగా శాస్త్రవేత్తలు తీర్చిదిద్దుతుంటారు. అందులో వ్యోమగాములకు శిక్షణ ఇచ్చేందుకు అవకాశం ఉంటుంది. రాబోయే రోజుల్లో భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ కీలకమైన మిషన్లు చేపట్టనున్న విషయం తెలిసిందే. ఇందులో కీలకమైన మిషన్ గగన్‌యాన్. ఇందులో మిషన్‌లో తొలిసారిగా అంతరిక్షంలోకి వ్యోమగాములను పంపబోతున్నది. ఈ పరిస్థితుల్లో అనలాగ్ మిషన్ కీలకంగా మారనున్నది. రాబోయే కాలంలో వ్యోమగాములకు శిక్షణ ఇచ్చేందుకు అవకాశం ఉంటుంది. లద్దాఖ్‌లోని వాతావరణ పరిస్థితులు కొంత వరకు చంద్రుడు, మార్స్ పరిస్థితులను పోలి ఉంటాయి. చల్లని, పొడి వాతావరణం, ఎక్కువ ఎత్తు ఉండడంతో ఇక్కడి నుంచి దీర్ఘకాలిక అంతరిక్ష మిషన్ల కోసం సన్నాహాలకు ఉపయుక్తంగా ఉండనున్నది. అనలాగ్ మిషన్‌లో పాల్గొనేవారంతా ఇతర గ్రహాలు, స్పేస్‌షిప్‌ల్లో ఉండే పరిస్థితులు అనుభవిస్తారు. భవిష్యత్‌లో ఇక్కడే అంతరిక్ష యాత్రకు సిద్ధం కానున్నారు. నిర్వహణ, మానసిక స్థితిని సైతం శాస్త్రవేత్తలు పర్యవేక్షించనున్నారు.

## భారత ఆర్థిక వేత్త బిబేక్ ఇకలేరు

(మొదటి తరువాయి)

చేశారు. దెబ్రాయ్.. ఆర్థిక, చరిత్ర, సంస్కృతి, రాజీకాయలు, ఆధ్యాత్మికత వంటి విభిన్న రంగాల్లో ప్రావీణ్యం కలిగిన వ్యక్తి అని కొనియాడారు. భారత ఆర్థిక విధానాల రూపకల్పనలో ఆయన చెరగని ముద్ర వేశారన్నారు. అంతేకాకుండా ప్రజా విధానానికి ఆయన చేసిన కృషి ఎనలేనిదని కొనియాడారు. పద్మశ్రీ గ్రహీత అయిన దెబ్రాయ్.. భారత ఆర్థిక విధానాలను రూపొందించడంలో ప్రధాన పాత్ర పోషించారు. డెబ్రాయ్ అనేక పుస్తకాలు, పత్రాలు, ప్రముఖ కథనాలను రచించారు. పలు వార్తాపత్రికల్లో బహుళ సంపాదకులుగానూ పనిచేశారు. మహాభారతం, భగవద్గీత, హరివంశం, వేదాలు, వాల్మీకి రామాయణం సహా శాస్త్రీయ సంస్కృతి గ్రంథాలను సంక్షిప్త రూపంలో ఆంగ్లంలోకి అనువదించారు. ఆయన కలకత్తాలోని ప్రెసిడెన్సీ కాలేజీ, పూణెలోని గోఖలే ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పాలిటిక్స్ అండ్ ఎకనామిక్స్‌కి ఛాన్సలర్‌గా పనిచేశారు. నవంబర్ 2004 నుంచి డిసెంబర్ 2009 వరకు నేషనల్ మ్యానుఫ్యాక్చరింగ్ కాంపిటీటివ్ కౌన్సిల్‌లో సభ్యుడిగా ఉన్నారు. రాష్ట్ర అభివృద్ధి ప్రణాళికను సిఫార్సు చేసేందుకు జార?ండ్ ముఖ్యమంత్రి ఏర్పాటు చేసిన కమిటీకి ఆయన ఛైర్మన్‌గానూ వ్యవహరించారు. అతను రాజస్థాన్‌లో ముఖ్యమంత్రి ఆర్థిక సలహా మండలి సభ్యుడు కూడా. 2014 నుంచి 2015 వరకూ భారతీయ రైల్వేలను పునర్నిర్మించడానికి రైల్వే మంత్రిత్వ శాఖ ఏర్పాటు చేసిన హైపవర్డ్ కమిటీకి ఛైర్మన్‌గా వ్యవహరించారు. 5 జనవరి 2015న ఆయన నీతీ ఆయోగ్‌లో శాశ్వత సభ్యునిగా నియమితుడయ్యారు. సెప్టెంబర్ 2017లో దెబ్రాయ్.. ప్రధానమంత్రికి ఆర్థిక సలహా మండలి ఛైర్మన్‌గా నియమితులయ్యారు.

## టిజి ఆర్టీసీ కీలక నిర్ణయం

(మొదటి తరువాయి)

అక్టోబర్ 31వ తేదీ నుంచి ఈ సేవలను ప్రారంభించింది. ఈ సేవలు రాష్ట్రవ్యాప్తంగా అందుబాటులోకి వచ్చాయని తెలిపింది. అలాగే ఈ సేవల ద్వారా బుక్ చేసుకునే పార్సిళ్లకు కేజీల బట్టి రుసుం వసూల్ చేస్తామని వివరించింది. కేజీ నుంచి ఐదు కేజీల వరకు రూ. 50. అలాగే కేజీ బరువు దాటిన నాటి నుంచి ఐదు కేజీల వరకు రూ. 60. ఐదు కేజీల నుంచి 10 కేజీల వరకు రూ. 65. పది కేజీలపై నుంచి 20 కేజీల వరకు రూ. 70. 20 కేజీలపై నుంచి 30 కేజీల వరకు రూ. 75 వసుల్ చేస్తామని టీజీఎస్ఆర్టీసీ తెలిపింది. కార్గో సేవలతో టీజీఎస్ఆర్టీసీకి మంచి లాభాలు వచ్చాయన్న సంగతి అందరికీ తెలిసిందే. అలాగే ఈ కార్గో సేవల వలే... పార్సిళ్ల సేవలతో హోమ్ డెలివరీ చేస్తే.. సంస్థకు మరింత ఆదాయం వస్తుందని టీజీఎస్ఆర్టీసీ ఉన్నతాధికారులు భావిస్తున్నారు. మరోవైపు తెలంగాణ ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం పేరిట మహాలక్ష్మి పథకం అమలు చేస్తుంది. ఈ పథకం వల్ల సంస్థకు నష్టం వస్తుందనే ప్రచారం ఉన్నా ప్రాచుర్యం పొందింది. ఈ క్రమంలో సంస్థ వివిధ మార్గాల్లో ఆదాయాన్ని సమకూర్చుకునేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తుంది. అందులోభాగంగా పార్సిళ్లను హోమ్ డెలివరీ చేసే కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. అలాగే వివిధ ప్రాంతాల నుంచి రాత్రి సమయంలో నగరానికి చేరుకునే ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అలాంటి సమస్యలు ఎదుర్కొనే వారు.. 040 69440000, టోల్ ఫ్రీ నెంబర్ 8008432929, 040-30102829 నెంబర్లకు ఫిర్యాదు చేయవచ్చని ఆర్టీసీ అధికారులు సూచిస్తున్నారు. ఇలా ఫిర్యాదు చేయడం వల్ల ఆ యా మార్గాల్లో రాత్రి వేళ్లలో బస్సుల సౌకర్యాన్ని ఏర్పాటు చేస్తామని వివరిస్తున్నారు.

## ముత్యాలమ్మ అమ్మవారి విగ్రహం ధ్వంసం ముంబై వాసి సల్మాన్ సలీమ్ అరెస్ట్



**హైదరాబాద్,**
సికింద్రాబాద్ కుమ్మరిగూడలోని ముత్యాలమ్మ దేవాలయంలో అమ్మవారి విగ్రహాన్ని ధ్వంసం చేసిన కేసులో నిందితుడిని పోలీసులు అరెస్టు చేశారు. అతడిని ముంబైకి చెందిన సల్మాన్ సలీమ్ ఠాగూర్ అలియాస్ సల్మాన్ (30)గా గుర్తించారు. మిగిలిన నిందితుల కోసం గాలిస్తున్నారు. మత విద్వేషాలు రెచ్చగొట్టే దురుద్దేశంతో హైదరాబాద్‌లో నిర్వహిస్తున్న సదస్సుకు సల్మాన్ హాజరయ్యాడని, ఈ క్రమంలోనే ఈ దుశ్చర్యకు పాల్పడ్డాడని పోలీసులు తెలిపారు. ఈ సదస్సుకు 151 మంది వచ్చారని, వారికి నిర్వాహకులు హోటల్లో వసతి కల్పించారని పోలీసుల విచారణలో తేలింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గత నెల 14న తెల్లవారుజామున గుర్తు తెలియని వ్యక్తి ఆలయంలోకి ప్రవేశించి గర్భగుడి తాళం పగులగొట్టాడు. అమ్మవారి విగ్రహాన్ని ధ్వంసం చేశాడు. గుడిపైకి చేరుకొని పైన ఉన్న విగ్రహాన్ని పగులగొట్టడానికి యత్నించాడు. స్థానికుడు ఒకరు గమనించి ఆగంతకుడిని పట్టుకున్నాడు. ఈలోపు మరికొందరు స్థానికులు చేరుకొని ఆగ్రహావేశాలతో నిందితుడిపై దాడి చేశారు. స్థానిక మార్కెట్ పోలీసులకు నిందితుడిని అప్పగించారు. గాయాలపాలైన అతడిని పోలీసులు ఆస్పత్రికి తరలించి, చికిత్స చేయించారు. ఆ తర్వాత విచారణ చేయగా అతను ముంబైకి చెందినవాడని, పేరు సల్మాన్, బీఈ (కంప్యూటర్స్) గ్రాడ్యుయేట్ అని తేలింది.

## డెమ్‌చాక్‌లో భారత్, చైనా బలగాల గస్తీ షురూ



**న్యూఢిల్లీ:**
తూర్పు లడఖ్‌లోని డెమ్‌చాక్‌లో భారత్, చైనా బలగాలు సమ న్వయ గస్తీని ఆరంభించాయని సైనిక వర్గాలు శుక్రవారం ధృవీకరించాయి. డెప్సాంగ్‌లో కూడా త్వరలోనే గస్తీ ప్రారంభమవుతుందని తెలిపాయి. ఇరు ప్రాంతాల్లో బుధవారం బలగాల ఉపసంహరణ పూర్తయిన నేపథ్యంలో ఈ గస్తీ చర్యలు ఆరంభించారు. దీంతో 2020 మేలో ప్రతిష్టంభన నెలకొన్న పాయింట్ల వద్ద నుండి పూర్తిగా బలగాలన్నీ వైదొలగినట్లైంది. దీపావళి సందర్భంగా గురు వారం వాస్తవాధీన రేఖ (ఎల్ఏసి) పొడవునా పలు సరిహద్దు పాయింట్ల వద్ద ఇరు దేశాల బలగాలు మిఠాయిలు పంచుకున్నారు. నాలుగేళ్ళకు పైగా ఇరు దేశాల మధ్య నెలకొన్న ప్రతిష్టంభనకు తెర దించుతూ ఉభయ పక్షాల మధ్య ఒప్పందం కుదిరిందని గత నెల 21న ఢిల్లీలో విదేశాంగ కార్యదర్శి విక్రమ్ మిస్త్రి చెప్పారు.

## వికారాబాద్ జిల్లాలో దారుణ ఘటన

**-మైనర్ బాలికపై నలుగురు మైనర్ల లైంగికదాడి**



వికారాబాద్,
వికారాబాద్ జిల్లాలో దారుణం చోటు చేసుకుంది. ఎనిమిదో తరగతి చదవుతున్న 13 ఏళ్ల బాలికపై 4గురు మైనర్లు లైంగిక దాడికి పాల్పడటం స్థానికంగా కలకలం రేపింది. ఈ సంఘటన వికారాబాద్ జిల్లా దోమ పోలిస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ముబావంగా ఉన్న బాలికను తల్లిదండ్రులు ప్రశ్నించడంతో జరిగిన ఘోరాన్ని వివరించింది. దీంతో బాలిక తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు నలుగురు మైనర్లను అదుపులోకి తీసుకొని విచారిస్తున్నట్లు సమాచారం.

## ఎక్సైజ్ పీఎస్‌లో రాజ్ పాకాల

**-విచారణకు హాజరైన కేటీఆర్ బావమరిది**

**చేవెళ్ల** బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ బావమరిది రాజ్ పాకాలను రంగారెడ్డి జిల్లా చేవెళ్ల ఎక్సైజ్ కార్యాలయంలో పోలీసు అధికారులు శుక్రవారం విచారించారు. జన్వాడలోని ఫామ్‌హౌస్‌లో గత శనివారం రాజ్‌పాకాల కుటుంబ సభ్యులు దావత్ చేసుకున్న నేపథ్యంలో విదేశీ మద్యం పట్టుబడిన విషయం తెలిసిందే. ఈ కేసులో పోలీసులు దర్యాప్తు ముమ్మరం చేశారు. ఈ క్రమంలో రాజ్ పాకాల శుక్రవారం తన న్యాయవాదితో కలిసి చేవెళ్ల ఎక్సైజ్ ఆఫీస్‌కు వచ్చి పోలీసుల ఎదుట విచారణకు హాజరయ్యారు. ఫామ్‌హౌస్‌లో పట్టుబడిన అనుమతి లేని విదేశీ మద్యం, ఎన్డీపీ మద్యం విషయమై ఆయన్ను పోలీసులు విచారించారు. ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ దశరథ్, ఎన్‌ఫోర్స్‌మెంట్ ఏఈ ఎస్. జీవన్ కుమార్, ఎక్సైజ్ సీఐ శ్రీలత ఆధ్వర్యంలో విచారించారు. చేవెళ్ల ఎక్సైజ్ పోలీసులు ఇప్పటికే ఆధారాలు సేకరించారు. పార్టీలో డ్రగ్స్ వాడకంపై కూడా ఆరా తీస్తున్నారు.

# ఇచ్చిన మాట ప్రకారం ఇంటింటి సర్వే

**-పభుత్వానికి పూర్తిగా సహకరించండి**
**- సమగ్ర కులగణనపై రాష్ట్ర ప్రజలకు మంత్రి పొన్నం బహిరంగ లేఖ**



**హైదరాబాద్**
ఎన్నికల మ్యానిఫెస్టోలో కాంగ్రెస్ ప్రజలకిచ్చిన మాట ప్రకారం ఈ నెల ఆరో తేదీనుంచి రాష్ట్రంలో ఇంటింటి సమగ్ర సర్వేను నిర్వహించనున్నట్లు బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. ఈ మేరకు ఆయన శుక్రవారం రాష్ట్ర ప్రజలకు బహిరంగలేఖ రాశారు. గతేడాది ఎన్నికల సమ యంలో కామారెడ్డి బహిరంగ సభలో తమ పార్టీ అగ్రనాయకులు రాహుల్ గాంధీ, కర్నాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్య సమక్షంలో బీసీ డిక్లరేషన్‌ను ప్రకటించామని గుర్తు చేశారు. ఆ మాట ప్రకారమే కాంగ్రెస్ అధికారంలోకి రాగానే ఈ ఏడాది ఫిబ్రవరిలో జరిగిన మంత్రి వర్గ సమా వేశంలో సమగ్ర సర్వే(సామాజిక, ఆర్థిక, విద్యా, ఉపాది, రాజకీయ, కులాల సర్వే) కుల గణన చేపట్టాలని నిర్ణయించినట్టు గుర్తు చేశారు. శాసన సభలో కూడా తీర్మానం చేసినట్టు తెలిపారు. దీనికి అనుగుణంగా జీవో 26ద్వారా కుల గణన చేసేందుకు తెలంగాణ బీసీ కమిషన్ తీర్మానాన్ని అనుసరించి బీసీ సంక్షేమ శాఖ ద్వారా రూ.150 కోట్లను విడుదల చేసేందుకు ప్రక్రియను ప్రారంభించిందని పేర్కొన్నారు. 30 లోపు సమాచార సేకరణ పూర్తి చేయాలనే ప్రణాళికలతో కార్యక్రమాన్ని చేపట్టినట్టు పేర్కొన్నారు. దీనికి ప్రజలందరూ సహకరించాలని విజ్ఞప్తి చేశారు. ఈ సర్వే రాబోయే కాలంలో అన్ని రకాల పథకాలను పొందేందుకు మెగా హెల్త్ చెకప్ లాగా ఉపయోగపడుతుందని తెలిపారు.

# కొత్త డైట్‌ను అందుబాటులోకి తేవాలి

**- ఉన్నతాధికారులకు సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశం**



**హైదరాబాద్**
విద్యార్థులకు పోషకాహారం అందేలా డైట్‌లో మార్పులు, చేర్పులు చేయాలని ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి ఉన్నతాధికారులకు సూచించారు. పది రోజుల్లో కొత్త డైట్‌ను అందుబాటులోకి తీసుకురావాలని వారిని ఆదేశించారు. ప్రభుత్వ వసతిగృహ విద్యార్థులకు డైట్, కాస్మోటిక్ చార్జీలు పెంచిన నేపథ్యంలో ముఖ్యమంత్రికి విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి బుర్రా వెంకటేశం, వివిధ సంక్షేమ విభాగాల సెక్రెటరీలు కృతజ్ఞతలు తెలిపారు. దీపావళి కానుకగా రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ వసతి గృహాలు, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ వసతిగృహాలు, తెలంగాణ గురుకుల విద్యా సంస్థల సొసైటీ పరిధిలోని వసతిగృహాల్లో డైట్ చార్జీలను రాష్ట్ర ప్రభుత్వం పెంచిన సంగతి తెలిసిందే. డైట్ చార్జీల పెంపు విషయంలో కమిటీ ప్రతిపాదనను యథావిధిగా అమలు చేయడంపై ఉన్నతాధికారులు హర్షం వ్యక్తం చేశారు. పెంచిన డైట్, కాస్మోటిక్ చార్జీలతో 7,65,705 మంది విద్యార్థులకు ప్రయోజనం చేకూరనున్నది.

# మహారాష్ట్రలో ఎలాంటి గ్యారంటీలను అమలు చేయడం లేదు


**-గ్యారంటీల అమలుతో రాష్ట్రం దివాలే**
**-మల్లికార్జున ఖర్గే కీలక వ్యాఖ్యలు**



**న్యూఢిల్లీ,**
కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే కీలక ప్రకటన చేశారు. మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో ఆరు, ఏడు అంటూ ఎలాంటి గ్యారంటీలూ ప్రకటించడం లేదని స్పష్టం చేశారు. బడ్జెట్ ఆధారంగా హామీలు ప్రకటించాలని.. లేదంటే రాష్ట్రం దివాలా పరిస్థితికి చేరుతుందని వ్యాఖ్యానించారు. విలేకరులతో ఖర్గే మాట్లాడుతూ.. 'త్వరలో జరగబోయే మహారాష్ట్ర ఎన్నికల్లో 5, 6, 10, 20 ఇలా ఏ ఒక్క హామీలను ప్రకటించడం లేదు. బడ్జెట్ ఆధారంగా హామీలు ప్రకటించాలి. లేదంటే రాష్ట్రం దివాలా పరిస్థితికి చేరుతుంది. ప్రణాళికా రహిత విధానం ఆర్థిక ఇబ్బందులకు దారి తీస్తుంది. ఇచ్చిన హామీలు నెరవేర్చకపోతే.. భవిష్యత్తు తరాలపై ప్రతికూల ప్రభావం పడుతుంది. రోడ్లు వేసేందుకు కూడా డబ్బు లేకపోతే.. ప్రభుత్వంపై ప్రజలు తిరగబడతారు. ప్రభుత్వం విఫలమైతే భవిష్యత్తు తరానికి చెడ్డపేరు తప్ప మరొకటి మిగలదు' అంటూ ఎన్నికల హామీలపై ఖర్గే వ్యాఖ్యానించారు. ఎన్నికల సమయంలో ప్రజలు ఆకట్టుకునేందుకు కాంగ్రెస్ పార్టీ ప్రజలకు పలు హామీలను ఇస్తున్న విషయం తెలిసిందే. కర్ణాటకలో ఐదు గ్యారంటీలతో, తెలంగాణలో ఆరు గ్యారంటీలతో అధికారంలోకి వచ్చింది. అయితే, గ్యారెంటీల పేరుతో ఆకర్షించి ఓట్లు వేయించుకున్న ఆ పార్టీ ఇప్పుడు ఉచిత పథకాలను అమలు చేయలేక చేతులెత్తేస్తున్నది. కర్ణాటకలో అధికారంలోకి వచ్చిన నెల రోజులకే ఆడంబరంగా ప్రారంభించిన ఉచిత బస్సు పథకానికి ఏడాదిన్నరకే మంగళం పాడేందుకు సిద్ధమైంది. ఈ పథకాన్ని నిలిపేసేందుకు ఇప్పటికే కసరత్తు మొదలు పెట్టినట్లు సమాచారం. తెలంగాణలో సైతం ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో హస్తం పార్టీ విఫలమవుతోందని విపక్షాలు తీవ్ర విమర్శలు చేస్తున్నాయి. ఈ పరిణామాల దృష్ట్యా రాబోయే మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో ఈ హామీలపై కాంగ్రెస్ పార్టీ వెనకడుగు వేస్తున్నట్లు తెలుస్తోంది.

## 3నుంచి వయనాడ్‌లో ప్రియాంక ప్రచారం

**-వెల్లడించిన కాంగ్రెస్ పార్టీ**



**తిరువనంతపురం,**
కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి ప్రియాంక గాంధీ నవంబర్ 3 నుంచి వాయనాడ్ లోక్ సభ ఉపఎన్నికల ప్రచారం మొదలెట్టనున్నది. ఆమె వెంట ఆమె సోదరుడు రాహుల్ గాంధీ కూడా ప్రచారంలో పాల్గొననున్నారు. ఈ విషయాన్నికాంగ్రెస్ పార్టీ శుక్రవారం తెలిపింది. ప్రియాంక గాంధీకి ఇదే తొలి ఎన్నికల ప్రచారం. ఇదివరలో ఆమె ఎక్కడి నుంచి పోటీ చేయలేదు. కాకపోతే ప్రచార సభలలో పాల్గొన్నారు. కాగా ఎల్ డిఎఫ్ అభ్యర్థి సత్యన్ మోకేరి మాట్లాడుతూ రాహుల్ గాంధీ మాదిరిగానే ప్రియాంక గాంధీ కూడా వాయనాడ్ కు ఓ అతిథిలా వచ్చి వెళ్లిపోతుందన్నారు. బిజెపి అభ్యర్థి నవ్యా హరిదాస్ కూడా ప్రియాంక గాంధీ ఓ పండుగలా వచ్చి వెళ్లిపోయేదేనన్నారు. ఇదిలావుండగా సిపిఐ(ఎం) నుంచి దూరమైన నీలాంబుర్ స్వతంత్ర ఎంఎల్ఏ పి.వి.అన్వర్ ఇప్పటికే ప్రియాంకకు మద్దతును తెలిపారు. వాయనాడ్ నియోజకవర్గానికి ఓటింగ్ నవంబర్ 13న ఓటింగ్ జరుగనున్నది.

## పేలిన ఉలిగడ్డ.. ఒకరి మృతి



**లక్నో,**
దీపావళి పండగా సందర్భంగా కొన్నికొన్నిసార్లు కొందరి కుటుంబాల్లో విషాదాలు చోటుచేసుకుంటున్నాయి. బాంబులను పేల్చే సమయంలో ఏ మాత్రం అజాగ్రత్తగా ఉంటే వారి కుటుంబాల్లో తీరని విషయాన్ని మిగుల్చుతున్నాయి. ఈ నేపథ్యంలోనే ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని ఏలూరు జిల్లాలో ఓ వ్యక్తి దీపావళి పటాకులు విక్రయించడానికి 'ఉల్లిగడ్డ' బాంబులతో మోటారు సైకిల్ పై వెళుతుండగా ఒక దేవాలయం వద్ద గుంతలో పడినప్పుడు ఆ ఉల్లిగడ్డ బాంబులు పేలిపోయాయి. దీంతో ఆ వ్యక్తి మరణించగా, మరో ఐదారుగురు గాయ పడ్డారు. ఈ ఉల్లిగడ్డ బాంబుల్లో ఐఈడీ వంటి పేలుడు పదార్థాలు వాడి ఉంటారని అనుమానాలు ఉన్నాయి. ఈ ఘటన గురువారం మధ్యాహ్నం 12.17 గంటలకు జరిగినట్లు సీసీటీవీ కెమెరా ఫుటేజ్ చూపుతోంది. గాయ పడిన ఆరుగురు వ్యక్తులు జిల్లా కేంద్ర దవాఖానలో చికిత్స పొందుతున్నారు. వారిలో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉంది. బాంబు పేలుళ్లతో ఆ ప్రాంతం అంతా పొగ కమ్మేసింది. పేలుడుతో పరిసర ప్రాంతాలు భయానకంగా మారాయి. స్కూటర్ మీద ఉల్లిగడ్డ బాంబులు తీసుకెళ్తున్న వ్యక్తిని సుధాకర్ అని గుర్తించారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## సంపాదకీయం

## ప్రతిష్టాత్మకంగా మహారాష్ట్ర, జార్ఖండ్ ఎన్నికలు !

ఈ నెలలోనే పలు రాష్ట్రాలకు ఎన్నికలు జరుగబోతున్నాయి. అలాగే యూపి, పంజాబ్, వయనాడ్‌లలో ఉప ఎన్నికలు కూడా ఉన్నాయి. ఓ రకంగ చెప్పాలంటే హర్యానా, కాశ్మీర్ ఎన్నికల తరవాత జరుగుతున్న ఈ ఎన్నికలు మోడీకి, రాహుల్‌కు పరీక్ష లాంటివి. అలాగే మహారాష్ట్రలో కూడా ఎన్నికలు బిజెపి కూటమికి సవాల్‌గానే చూడాలి. కాంగ్రెస్ కూటమి అక్కడ బలంగానే ఉంది. ఇకపోతే జార్ఖండ్‌లో కూడా బిజెపి ఎత్తులు వేసి హేమంత్ సోరెన్‌ను ముప్పుతిప్పలు పెట్టింది. కేసుల్లో జైలుకు తోసింది. తిరిగి బయటకు వచ్చాక కూడా స్థిరంగా పాలన చేసుకునే పరిస్థితి లేదు. ఈ నెల 20న మహారాష్ట్ర శాసనసభ ఎన్నికలు జరగ నున్నాయి. ఆ రాష్ట్ర ప్రజలే కాదు, యావద్దేశ జనులూ ఈఎన్నికల ఫలితాలు ఎలా ఉండనున్నాయనే ఉత్కంఠతో ఉన్నారు. మహారాష్ట్రలోను, విశాల భాతదేశంలోను ప్రజలంతా ఇక్కడి ఎన్నికలపై ఆసక్తిగా చూస్తున్నారు. 'లడ్కీ బహిన్' పేరుతో ముఖ్యమంత్రి ఏక్‌నాథ్ షిండే ప్రభుత్వం సరికొత్తగా అమలు పరుస్తున్న 'సంక్షేమ' పథకం గట్టెక్కిస్తుందని నమ్మకంగా ఉన్నారు. సంవత్సరాదాయం రూ. రెండున్నర లక్షల కంటే తక్కువగా ఉన్న ప్రతి కుటుంబానికి నెలా నెలా ఆ కుటుంబ గృహిణికి రూ.1500 బ్యాంకు ఖాతాలో జమ చేస్తామని హామీ ఇచ్చారు. ఇప్పుడు ఈ ఉదార ఆర్థిక హాయమే చర్చనీయాంశంగా ఉన్నది. అయితే అది ఒక నిర్ణాయకమైన రాజకీయ ప్రశ్నను కూడా లేవనెత్తుతున్నది. తెలంగాణలో కూడా ఎన్నికల ముందు రెండున్నర వేలు ఆడిబిడ్డ ఖాతాలో వేస్తామని ఇలాంటి హామీనే ఇచ్చారు. రాష్ట్రాల్లో లేదా కేంద్రంలో మరోమారు అధికారం కోసం ఎన్నికల ముందు ఇలాంటి హామీలు ఇవ్వడం అన్నది సర్వసాధారణంగా మారింది. ఓ రకంగా చెప్పాలంటే క్విడ్‌ప్రోకో లాంటిదే. తాయిలాలు ప్రకటించడం...ఎన్నికల్లో గెలవడం అన్నది కొత్త పరిభాషగా మారింది. బిజెపి కూడా ఇదే కోవలో ప్రయాణం చేస్తోంది. పేదలకు లేదా మహిళలు, లేదా బడుగు బలహీన వర్గాల ఓట్లను గంపగుత్తగా దక్కించుకునేందుకు ఇలాంటి ఎత్తుగడలు వేస్తున్నారు. నగదు సహాయం పేరిట లంచాలు ఇవ్వడం ఇదే మొదటిసారి కాదు. ఓటర్లకు ప్రత్యక్ష నగదు చెల్లింపులు చేయడం అన్నది ఎన్నికల్లో జరుగుతూనే ఉంది. ఈ క్రమంలోనే మహారాష్ట్ర ఎన్నికల్లో ఏక్‌నాథ్ షిండే తన అధికారం నిలుపుకునేందుకు లడ్కీ బహిన్ పథకం తీసుకుని వచ్చారు. ఇలా ఆర్థిక సహాయం అందించేందుకు మహారాష్ట్ర ప్రభుత్వం నెలకు ఇంచుమించు రూ.3700 కోట్లు వెచ్చించనున్నది. వార్షికంగా రూ.46 వేల కోట్ల భారం ఆ రాష్ట్ర ప్రభుత్వంపై పడనున్నది. మహారాష్ట్ర ప్రభుత్వ రుణభారం ఇప్పటికే రూ.7.8 లక్షల కోట్లుగా ఉన్నదని అంచనా. ప్రతిపక్ష కూటమి మహా వికాస్ అగాఢీని చిత్తుచేసేందుకు ఉద్దేశించిన తెలివైన రాజకీయంగా దీనిని చెప్పుకోవాలి. మొన్నటి లోక్‌సభ ఎన్నికల్లో పాలక మహాయుతి కూటమి రాష్ట్రంలోని 48 ఎంపి సీట్లలో కేవలం 17ను మాత్రమే గెలుచుకోగలిగింది. ఈ కారణంగా ఓటర్ల బృందాలను ఆకట్టుకునే క్రమంలో లడ్కీ బహిన్ పథకాన్ని ఏక్‌నాథ్ షిండే ప్రకటించారు. మహిళలు, యువత లక్ష్యంగా లడ్కీ బహిన్, నిరుద్యోగ యువతకు 'లడ్కా భావు' పేరిట నగదు సహాయం చేసేందుకు షిండే సర్కార్ నిర్ణయించింది. లోక్‌సభ ఎన్నికలలో ప్రతిపక్ష ఇండియా కూటమి రాజ్యాంగం ప్రమాదంలో పడిందన్న నినాదంతో బిజెపిని ముచ్చెమటలు పోయించింది. ఈ ప్రమాదం నుంచి తప్పించుకునే క్రమంలో ఇప్పుడు షిండే ప్రభుత్వం నగదు ఆధారిత పథకాలను శాసనసభ ఎన్నికల ప్రధాన ప్రచారాంశంగా చేయడం గమనార్హం. ఇక జార్ఖండ్‌లోనూ ఇండియా కూటమి బాగానే పనిచేస్తోంది. ఇక్కడ సంక్షేమ పథకాల వైపు మొగ్గుతారా? సానుభూతి అంశాలకు పీటవేస్తారా? అన్నది జార్ఖండ్ ఓటర్ల మనోభావాల మీద గెలుపోటములు ఆధారపడ్డాయి. ఇద్దరి అమ్ముల పొదిలోనూ ఈ రెండంశాల విడివిడి అస్త్రాలున్నాయి. 18–50 ఏళ్ల మధ్య వయస్కులైన ప్రతి మహిళకు నెలనెలా వెయ్యి రూపాయలిచ్చే 'మయ్యా సమ్మాన్ యోజన' తో 53 లక్షల మంది లబ్దిదారులు ప్రయోజనం పొందుతున్నారు. దీంతోపాటు 200 యూనిట్లలోపు విద్యుత్ బిల్లుల మాఫీ వల్ల 40 లక్షల కుటంబాలు, వ్యవసాయ రుణాల మాఫీ వల్ల 1.7 లక్షల కుటుంబాలు తమకు సానుకూలంగా ఉన్నారని, వారే ప్రభుత్వాన్ని తిరిగి గెలిపించుకుంటారని జెఎంఎం, 'ఇండియా' నమ్మకంతో ఉంది. దీనికి ధీటుగా బిజెపి కూడా తాయిలాలను ప్రకటించింది. తాము అధికారంలోకి వస్తే ప్రతి మహిళకు కనీస నెలసరి ఆదాయం అందించడం, ఉచిత వంటగ్యాస్, ఉద్యోగ కల్పన, నిరుద్యోగ భృతి, గృహ సదుపాయం.. 'పాంచ్ ప్రాణ్' అమల్లోకి తెస్తామని బిజెపి ప్రచారం చేస్తోంది. ఇవికాకుండా.. బిజెపి ఆదివాసీ వ్యతిరేక పార్టీ అని, అందుకే ఎస్‌టిలకు ప్రాధాన్యత ఇవ్వకపోగా సిఎం హేమంత్ సోరెన్‌ను అక్రమంగా జైలుపాలు చేసిందని జెఎంఎం ప్రచారం ఉధృతం చేస్తోంది. సరిహద్దుల నుంచి వచ్చే బంగ్లాదేశ్ చొరబాటుదారుల వల్ల స్థానిక ఆదివాసీల ప్రయోజనాలకు తీవ్రభంగం వాటిల్లుతోందని, తాము అధికారంలోకి వస్తే ఈ పరిస్థితిని ఎన్‌ఆర్‌సి అమలుతో కట్టడిచేస్తామని బిజెపి చెబుతోంది. ఈ రెండు రాష్ట్రాల్లోనూ 'ఇండియా' ఎన్‌డిఎ కూటములుగా ముఖాముఖి తలపడుతున్నాయి. తెలంగాణ లాగానే జార్ఖండ్ కూడా పోరాడి ప్రత్యేక రాష్ట్రాన్ని సాధించుకుంది. 2000లో బీహార్ రాష్ట్ర విభజన జరిగి, జార్ఖండ్ ఏర్పడింది. 24 ఏళ్లలో ఇది అయిదో ఎన్నిక. నవంబరు 13, 20 తేదీల్లో రెండు విడతలుగా రాష్ట్ర అసెంబ్లీకి ఎన్నికలు జరుగనున్నాయి. నవంబరు 23న ఓట్ల లెక్కింపు. ప్రతి రాష్ట్ర ఎన్నిక లాగానే, జార్ఖండ్ ఎన్నికల్ని కూడా బిజెపి ఎంతో ప్రతిష్మాత్మకంగా తీసుకుంటోంది. మాజీ ముఖ్యమంత్రి చాంపయ్ సోరన్ తో పాటు పలువురు పేరున్న నాయకుల్ని పార్టీలోకి తిరిగి తెచ్చుకుంది. మూడుసార్లు ముఖ్యమంత్రిగా ఉన్న అర్జున్ ముండే ముఖ్యమంత్రి అభ్యర్థి అయ్యే అవకాశాలున్నాయి. 2024 లోక్‌సభ ఎన్నికల్లో ఆయన ఓడిపోయారు. సోరెన్ లాగే, సంతాలీ అయిన మాజీ ముఖ్యమంత్రి బాబూలాల్ మరాండిని ఏడాది కిందటే పార్టీ రాష్ట్ర అధ్యక్షుడిని చేసింది. ఈ ముగ్గురే కాకుండా మరో మాజీ ముఖ్యమంత్రి మధు కోడా సేవల్ని కూడా ఉపయోగించు కుంటోంది. రెండు నెలల వ్యవధిలో రెండు మార్లు రాష్ట్రంలో పర్యటించిన ప్రధాని నరేంద్ర మోడీ, ఎన్నికల పక్రియ ముగిసే లోపు మరో ఆరేడు సార్లు పర్యటించేలా ప్రచార ప్రణాళిక రచిస్తున్నారు. దానికి తోడు కేంద్ర ఇతర మంత్రులు, పలువురిని ప్రచారంలో మోహరిస్తున్నారు. మొత్తంగా మహారాష్ట్రలో అధికారం నిలబెట్టుకోవడం, జార్ఖండ్‌లో అధికారం దక్కించుకోవడం లక్ష్యంగా బిజెపి పావులు కదుపుతోంది. అయితే ధరల పెరుగుదల, నిరుద్యోగం, ద్రవ్యోల్బణం వంటి సమస్యలు బిజెపిని వెన్నాడుతూనే ఉన్నాయి. ఈ క్రమంలో ప్రజలు ఎవరిని ఆదరిస్తారన్నది చూడాలి.

## రష్యాపై ఉక్రోశం-అమెరికా మరిన్ని ఆంక్షలు

ఉక్రెయిన్‌పై రష్యా ప్రారంభించిన సైనిక చర్యకు 980 రోజులు నిండాయి. అది ఎప్పుడు ముగుస్తుందో ఎలా అంతమవుతుందో తెలియని స్థితి. అమెరికా నాయకత్వంలోని నాటో కూటమి దేశాలు ఎన్ని ఆయుధాలు, డాలర్లు ఎన్ని కుమ్మరించినా రోజురోజుకూ కొత్త ప్రాంతాల్లోకి రష్యా సేనలు చొచ్చుకుపోతున్నాయి. యుద్ధరంగంలో విజయం మాట అటుంచి నిలదొక్కుకోనేందుకే ఇబ్బందులు పడుతున్నాయని జెలెన్స్కీ దళాల గురించి ఎకనమిస్ట్ వంటి పత్రికలు రాస్తున్నాయి. అయినప్పటికీ మరోసారి చూడవలే అన్నట్లుగా అమెరికా రంగంలోకి దిగింది. ఇప్పటికే వేలాది కంపెనీలు, వ్యక్తుల మీద, రష్యా మీద అనేక ఆంక్షలను ప్రకటించిన అమెరికన్లు బుధవారం నాడు చైనాతో సహా పన్నెండు దేశాలకు చెందిన మరో నాలుగువందల కంపెనీలు, కొందరు వ్యక్తుల మీద కొత్తగా ఆంక్షలు విధిం చించారు. వీటిలో మన దేశానికి చెందిన పందొమ్మిది కంపెనీలు, ఇద్దరు వ్యక్తులు ఉన్నారు. అటు ప్రజోపయోగానికి, దాన్నే మిలిటరీ అవసరాలకు వినియోగించే కీలక, అధునాతన సాంకేతిక పరిజ్ఞానం, పరికరాలను ఈ కంపెనీలు రష్యాకు సరఫరా చేస్తున్నాయన్నది అమెరికా ఆరోపణ. తమ సాంకేతిక పరిజ్ఞాన అపహరణ, దిగుమతి, కొన్ని రకాల పరికరాలను, ఇతర దేశాల నుంచి దిగుమతి చేసుకున్న వాటిని భారత కంపెనీలు రష్యాకు మళ్లించి అక్కడ డ్రోన్ల వంటి ఆయుధాల తయారీకి తోడ్పడుతున్నాయని అంటోంది. అలా జరుగుతోందో లేదో ఎలాంటి రుజువులు లేవు.




అయితే ఏ నిబంధనల ప్రకారం అమెరికా వందల కోట్ల డాలర్ల ఆధునిక ఆయుధాలు, నగదు ఉక్రెయిన్‌కు అందిస్తున్నట్లు? అడ్డగోలు వ్యవహారం తప్ప మరొకటి కాదు. ఇది రాసిన సమయానికి ఈ పరిణామంపై మన దేశ స్పందన లేదు. ఉక్రెయిన్ వివాదంలో తటస్త వైఖరితో ఉన్న సంగతి తెలిసిందే. ఎటూ మొగ్గకపోయినప్పటికీ అమెరికా ఆంక్షలను ఖాతరు చేయకుండా రష్యా నుంచి పెద్ద ఎత్తున ముడి చమురు, ఎరువులు, ఇతర వస్తు వులు, మిలిటరీ సామగ్రి, ఆయుధాలను మనదేశం కొనుగోలు చేస్తున్నది. అమెరికా ఎన్ని ఆంక్షలు విధించినా ఇప్పటి వరకు రష్యా ఆయుధ ఉత్పత్తికి ఎలాంటి అంతరాయమూ కలిగినట్లు వార్తలు లేవు. అదే విధంగా అంతకు ముందు కంటే ముడి చమురును కూడా ఎక్కువగా ఎగుమతి చేస్తోంది. ఈ కారణంగానే ఉక్రోశంతో మరిన్ని ఆంక్షలకు అమెరికా తెగబడుతోంది. ఉత్తర కొరియా నుంచి వచ్చిన సైనికులు రష్యా తరఫున ఉక్రెయిన్‌లో దాడులు చేస్తున్నారని కూడా కొద్ది రోజులుగా కొత్త పల్లవి అందుకుంది. ఉక్రెయిన్‌లో నాటో దేశాలు వివిధ దేశాల నుంచి రప్పించిన కిరాయి మూకలు రష్యన్ల మీద దాడులకు వినియోగిస్తున్నారనే వార్తలు వెలు వడిన పూర్వరంగంలో రష్యా మీద ఎదురుదాడికి ఉత్తర కొరియాను లాగటం తప్ప ఇంతవరకు అలాంటి ఆధారాలున్నట్లు అమెరికా కూడా చెప్పటం లేదు.

రానున్న వారాల్లో వస్తారని ఒకసారి, ఇప్పటికే పదివేల మందిని సిద్ధం చేశారు, శిక్షణ ఇప్పిస్తున్నారంటూ మరోసారి పెంటగన్, సిఐఏ కట్టుకథలను వ్యాపింపచేస్తున్నాయి. అమెరికా రక్షణ మంత్రి లాయడ్ ఆస్టిన్ పైకి ఎన్ని కబుర్లు చెప్పినా, యుద్ధరంగంలో ఉన్న ఉక్రెయిన్ మిలిటరీ కమాండర్లు, పశ్చిమదేశాలకు చెందిన వారు రానున్న ఆరునెలల్లో రష్యా దళాలను అడ్డుకోవటం, అసలు పోరు ఎటుపోతున్నదో అర్ధం కావటం లేదంటూ ప్రయివేటు సంభాషణల్లో చెబుతున్నారని ఎకనమిస్ట్ పత్రిక రాసింది. ఒకటి రెండు చోట్ల పుతిన్ సేనలను నిలువరించినా అనేక ప్రాంతాల్లో రష్యా చొచ్చుకుపోతున్నదని పేర్కొన్నది. కొన్నిసార్లు పెద్దగా సాధించిందేమీ లేకపోయినా మొత్తం మీద రష్యా సేనలు ఉక్రెయిన్ తూర్పు ప్రాంతంలో ముందుకు పోతున్నాయని అమెరికా అగ్రపత్రిక న్యూయార్క్ టైమ్స్ కూడా రాసింది. ఈ ఏడాది ఇప్పటి వరకు రష్యా అదుపులోకి వచ్చిన ఉక్రెయిన్ ప్రాంతాలలో సగం గత మూడునెల్లో సాధించినవే అని, ఉక్రెయిన్ సేనలు డాన్‌బాస్ ప్రాంతంలో నిలవటం కష్టమని నిపుణులను ఉటంకిస్తూ ఆ పత్రిక రాసింది.

తాను నేరుగా రంగంలోకి దిగేందుకు నాటోకూటమి భయపడుతున్నది. ఎన్ని ఆయుధాలిచ్చినా బూడిదలో పోసిన పన్నీరుగా మారుతున్నాయి. ఉక్రెయిన్‌లో రోజురోజుకూ శిక్షణ పొందిన సైనికుల సంఖ్య కూడా తగ్గుతున్నది, నాటో ఇచ్చిన ఆధునిక ఆయుధాలను జెలెన్స్కీ సేనలకు అందచేస్తే అవెక్కడ రష్యన్ల పరం అవుతాయోమోన్న భయం కూడా ఉంది. అందుకే వినియోగించేందుకు నిపుణుల పేరుతో అమెరికా, ఇతర దేశాల నుంచి పరిమితంగా మిలిటరీని దిగుమతి చేసుకోవాల్సి వస్తోంది. అక్కడ పరిస్థితి ఇలా ఉంది గనుకనే అమెరికా ఉక్రోశం రోజు రోజుకూ పెరిగిపోతున్నట్లు కనిపిస్తోంది.

## అంధకార ప్రపంచంలో 'అప్పో దీపో భవ'!

పద్నాలుగేళ్లు అరణ్యవాసం చేసిన రాముడు, సీతాలక్ష్మణులతో తిరిగి వస్తున్నాడంటే అయోధ్య ప్రజలు తమ ఆనందాన్నంతా ప్రమిదల్లోకి ఒంపి దీపాలు వెలిగించారట. అయోధ్య దేదీప్యమానమైందట. వియోగం ఎప్పుడూ చీకటే. కలయిక ఎప్పుడూ వేడుకే. రాముడి కథకూ, చారిత్రక బుద్ధుడి కథకూ ఎందుకో ఎన్నో పోలికలు! కుటుంబాన్ని, రాజ్యాన్ని, దేశాన్ని వదిలి సత్యాన్వేషణకై వెళ్లిన సిద్ధార్థ గౌతముడు, మానవ దుఃఖాలకు కారణాలను, నివారణలను తెలుసుకుని బుద్ధుడయ్యాక, తల్లిదండ్రులు, పుట్టిన నేల పిలిచిందని సందర్శనకు వస్తుంటే, కళ్లల్లో వత్తులు వేసుకుని చూస్తున్న కపిలవస్తు, వీధులన్నిటిలోనూ వెలుతురు ముగ్గులేసి స్వాగతించిందట! ఆ శాక్యప్రజలకు తెలుసు బుద్ధుడు ఉండిపోవడానికి రావడం లేదు, రాజ్యం ఏలడానికీ రావడం లేదు, తన మీద బెంగనే కాదు, బెంగలన్నిటినీ తీర్చడానికి వస్తున్నాడు! ఆశ్వయుజ, కార్తీకమాసాలలో వచ్చే పండుగలకు అనేక కథనాలున్నాయి. రావణవధ జరిగింది దసరా అంటారు. కురుక్షేత్ర యుద్ధంలో పాండవులకు విజయం లభించిన సందర్భం అంటారు. అశోకుడు బౌద్ధంలోకి పరివర్తన చెందిన రోజు విజయదశమి అంటారు. పెద్దలను స్మరించుకోవడం, పూలపండుగ చేసుకోవడం, జమ్మి ఆకులు పంచుకోవడం, ఉపవాసనిష్ఠలు, వనభోజనాలు, అనేక సందర్భాలతో ఈ రెండు నెలల కాలం కిక్కిరిసిపోతుంది. పండగల వెనుక ఉన్న కథలేమైనా, ఈ రెండు మాసాల శరదృతువు, ఎంతో ఆహ్లాదకరమైన కాలం. "శారదరాత్రులుజ్వల లసత్తర తారక హారపంక్తుల"తో అలంకృతమయ్యాయని నన్నయ రాశాడు. వెదజల్లిన కర్పూరపు పుప్పొడిలాగా ఉంటుందట వెన్నెల. వర్ష రుతువు ముగిసి, జలాశయాలు నిండి, పూలవెల్లువతో నేల నేల అంతా ఉప్పొంగిపోతుంది. మబ్బులు లేని ఆకాశాలు, మెరిసే నక్షత్రాలు, కాటుకపొగల కృష్ణ పక్షాలు, తుళ్లింతల తేరు మీద రాత్రింబవళ్లు సవారీ చేస్తాయి. మనకు అమావాస్యతో నెలముగుస్తుంది కదా, నేటి దీపావళి తరువాత కార్తీకం కదా? దేశంలో చాలా మందికి, ముఖ్యం ఉత్తరాదికి, పున్నమి నుంచి పున్నమికి నెల. వాళ్లకు కార్తీకం ఇప్పటికే మొదలై పక్షం గడిచింది! కాలపు లెక్కలకేమి గానీ, ఈ రెండు మాసాల మీద కమ్మినదొక జన, వన జాతరల జమిలి రుతువు! పర్వదినం అంటే, ఒకే సంతోషం అందరి కళ్లలోనూ వెలగడం కదా! లోకకంటకుడు ఎవరో హతుడయ్యాడని, ఎంతో జననష్టం జరిగే యుద్ధంలో



విజయం దక్కిందని పండగ చేసుకోవడంలో ఏదో అసౌకర్యం ఉన్నది. శాంతి, కరుణలు నిండిన ఉల్లాసంలో ఉత్సాహంలో కదా సంబరమన్నది! చెడు మీద మంచి విజయంగా ఆ పురాణకథలను చూడాలి అంటారు. ఆ విజయం హింస ద్వారానో, శిక్షించడం ద్వారా, బలవంతంగా నిర్మూలించడం ద్వారానో జరిగినప్పుడు, అక్కడ ఏదో అపజయం కూడా స్ఫురించడం లేదా? మూలకారణాన్ని కాక, వ్యక్తీకరణను మాత్రమే తొలగించే పని ఎవరు చేసినా అది అసంపూర్ణమే. అటువంటప్పుడే, ధర్మసంస్థాపనకు పదే పదే సంభవామి తప్పదని హామీలు పూచీలు ఇచ్చుకోవలసి వస్తుంది. ఒక్క దుష్ట శిక్షణ కూడా చేయకుండానే గౌతమబుద్ధుడు కొత్త ధర్మాన్ని స్థాపించాడే, అనేక ఆదర్శాలను వ్యాపింపజేశాడే? అది ఎట్లా సాధ్యపడింది? కానీ, ఏది ధర్మం? ఏది మంచి? ఏది చెడుగు? ఓ మహాత్మా ఓ మహర్షీ? ఎవరు ఎవరికి కంటకుడో ఏమో? యుద్ధంలో ఏ పక్షానిది న్యాయమో ఎవరు తేల్చాలి? రాసిన పురాణాలైనా, చరిత్రలైనా విజేతల కథనాలే కదా! ఐదు దశాబ్దాల కిందట శ్రీకాకుళం ఆదివాసులకు అత్యంత ఆప్తులైన ఉద్యమకారులను పోలీసులు కాల్చిచంపినప్పుడు, ఒక పత్రిక 'నరకాసుర వధ' అన్నపేరుతో సంపాదకీయం రాసింది. భూమిపుత్రుడు కదా నరకుడు, ఏ ప్రయోజనాల యుద్ధంలో అతను దేనికి చనిపోయాడో? ఆగ్రహాలను, ప్రతీకారాలను కాక, లోలోపల ప్రేమదీపాలను వెలిగించగల రోజులే హర్షరుతువులై, జీవనోత్సవాలైతే ఎంత బాగుండును! పండుగలు కేవలం భక్ష్యభోజ్యాలకు, పూజాతతంగాలకు పరిమితం కాక, ఆయా సందర్భాలలో దాగిన విలువలను తరచి చూడగలిగితే ఎంత సార్థకంగా ఉండును? లేదా, మనిషి తను కాలక్రమంలో సమకూర్చుకుని, దృఢపరచుకున్న కొత్త ఆశయాలకు, లక్ష్యాలకు, నీతికి అనుగుణమైన కొత్త పండుగలను కనిపెడితే, కరకుదనమూ రోషకషాయిత రౌద్రమూ కాక, మానవ ఆదిమ అమాయకత్వాన్ని పులుముకున్న దైవరూపాలనూ ఆవిష్కరిస్తే, వేడుకలు ఎంత దయగా ఉండేవి? ద్వేషంతో ఎవరినైనా, దేన్నైనా గెలవాలని ప్రయత్నించినప్పుడల్లా, ద్వేషమే గెలుస్తుంది. అట్లాగే, ద్వేషాన్ని ద్వేషంతో ఎప్పుడూ తొలగించలేము. న్యాయమైన ఆగ్రహాన్ని, పదిమంది మీద ప్రేమతో పుట్టే ప్రతిఘటనను కూడా బలప్రయోగంతో అణగార్చలేరు. వ్యక్తి స్వార్థమో, వర్గ, జాతి స్వార్థాలో, ఆక్రమణలో అపహరణలో కొందరిని ఆధిక్యంలోకి అనేకులను అధీనతలోకి నెట్టవచ్చు. దుర్మదంతో ఒకరు దౌర్జన్యం చేయవచ్చు. మరొకరు బక్కకోపం చూపవచ్చు. పరస్పరత కలిగిన సోదరత్వం మిగిలితే, మనుషులకీ తామసాలే అక్కరలేదు! గౌరవప్రదమైన మనుగడ కోసం, కాళ్ల కింద చారెడు నేల కోసం మనిషి పడే తపన, అందుకు అడ్డుపడే అత్యాశలు, వీటి మధ్యే అరిషడ్వర్గాలు! పోరాటాలు యుద్ధాలు సంగ్రామాలు! అప్పుడప్పుడు ఎవరో ఒకరు, ఏదో ఒక సమూహం సంచారిణీ దీపశిఖల్లాగా, లోకం మీదకు లిప్తకాలపు వెలుగులు విసిరి వెళ్లిపోతారు! సృష్టిలో చీకటి సర్వవ్యాపితం, గాఢం, అనంతం అని, వెలుగు మాత్రం స్వల్పం, స్థానికం అంటాడు కార్ల్ సాగన్! .."లోన జ్వలియించుచున్న మహానలమునకొక విస్ఫులింగమె కాద యీ యుత్సవాగ్ని" అంటూ దీపావళిని అంతర్ బహిర్ యుద్ధారావం చేశారు కవి వేదుల మనిషి భయాలన్నీ చీకటితోటల్లోనే సంచరిస్తుంటాయి. చీకటంటే భయమున్నవారే చావుకు భయపడతారని స్టీఫెన్ హాకింగ్ అన్న మాట మరింత భయపెడుతుంది. దేవుడనేవాడు పోతన ఊహించినట్టు పెంజీకటికి ఆవల ఉంటాడేమో, మన అపరిచితత్వపు భయాలను పారదోలడానికి ఏదో ఒక శక్తి లేకపోతే ఎట్లా? ఈ మహాసృష్టిలో, అన్ని జీవులకంటె అధికులమనుకునే మనుషులకే దేవుడు! తక్కిన అన్ని చరాచరాలూ అటానమస్! అబద్ధం, అజ్ఞానం, అధికారం, ఆధిక్యం, అహంకారం... చీకటికి ఎన్నో పర్యాయపదాలు, అర్థం మాత్రం ఒకటే.! కార్తీకరాత్రులు దీపాలంకరణకు బాగుంటాయి కానీ, కాలంలోను, స్థలంలోను, మానవహృదయంలోను ప్రమిదలు చీల్చలేని కటికచీకటి రాత్రులు పరచుకుని ఉన్నాయి.

# జ్ఞానకాంతుల దీపావళి...!!!

“ఒక దీపం వేల దీపాలను వెలిగించినట్టుగానే, మన సంతోషం ఇతరుల సంతోషానికి కారణం కావాలి.” అన్న బుద్ధుని బోధనకు విరుద్ధంగా భారతదేశంలో సంబరాలు జరుగుతున్నాయి. అయితే, ఈ పండుగల వెనుక శాస్త్రీయ విరుద్ధమైన కథనాలు ఉన్నాయి. వాటి చుట్టూ ఎన్నో పౌరాణిక గాథలను అల్లుకున్నారు. దసరా తర్వాత వచ్చే దీపావళికి రామాయణాన్ని ముడిపెట్టారు. ఈ రెండు పండుగలనూ చెడుపై మంచి సాధించిన విజయానికి గుర్తుగా జరుపుకుంటున్నట్టు చెప్పుకుంటున్నారు. శ్రీరాముడు పదితలల రావణుడిని చంపడంతో దసరా జరుపుకుంటున్నామని, రావణుడు చనిపోయిన తరువాత రాముడు, సీత, లక్ష్మణుడు అయోధ్యకు వచ్చిన సందర్భంగా దీపాలు వెలిగించి సంబురంగా దీపావళి చేసుకుంటున్నామంటున్నారు. సత్యభామ నరకాసురుడిని వధించినందుకు దీపాలు వెలిగించుకుంటున్నామని మరొక కథ చెబుతారు. కాళికాదేవి రాక్షసులను చంపినందుకు దేవీ నవరాత్రోత్సవాలు జరుపుకుంటున్నట్టు చెప్పుకుంటున్నారు. కానీ వాస్తవానికి బౌద్ధ మత సంప్రదాయమైన దీపావళిని హిందూ సంప్రదాయ పండుగగా చరిత్ర క్రమంలో మార్చివేశారనడానికి అనేక చారిత్రక ఆధారాలు ఉన్నాయి. అయితే పురాణాల్లో ఉన్న పాత్రలు చనిపోతే పండుగ జరుపుకునే ఆచారం ఇక్కడ తప్ప ఏ దేశంలో కనిపించదని డాక్టర్ దేవరాజు మహారాజు వంటి సాహితీవేత్త, జీవశాస్త్రవేత్తలు మరో కోణం వెల్లడిస్తున్నారు. బయటి దేశాల నుంచి భారతదేశానికి వచ్చిన ఆర్యులు ఇక్కడి మూలవాసులైన ద్రావిడులను అణచివేసిన సంఘటనలను పురాణాలుగా రాసుకున్నారని, వాటి నుంచే ఆచారాలు పుట్టాయని పెరియార్ వివరించారు. కానీ ఈ వాస్తవాలను చెవికెక్కనీయకుండా టపాకాయల మోత పెడుతున్నారు. ఆర్యులు భారతదేశ మూలవాసులను కోతులుగా, గుడ్డెలుగులుగా, రాక్షసులుగా చిత్రీకరించారని చెప్పిన సత్యాన్నీ స్వీకరించనీయడం లేదు.

**-సిద్ధార్థుడు బుద్ధుడై వెలిగి..**

బుద్ధుని కాలంలో ప్రారంభమైన ఈ దీపాల పండుగకు అశోక చక్రవర్తి వైభవాన్ని తెచ్చారు. క్రీస్తుపూర్వం ఆరవ శతాబ్దంలోనే బౌద్ధంలో దీపాల పండుగ మొదలైంది. సిద్ధార్థుడు బుద్ధుడైన తర్వాత పదిహేడేండ్లుగా కపిలవస్తుపురానికి రాలేదు. దీంతో తన తండ్రి శుద్ధోధనుడు బుద్ధుడిని నగరానికి తీసుకురావాలని కొంతమందిని పంపాడు. వారు బుద్ధుడిని కొన్నినెలలుగా అన్వేషిస్తూ ఆయన వద్దకు చేరారు. అయితే వారు బుద్ధుడిని నగరానికి తీసుకురావడంలో విఫలమయ్యారు. బుద్ధుడి బోధనలు, జీవిత సత్యాలను వినడంతో వారు ఆయనతోనే ఉండిపోయారు. బుద్ధుడి తండ్రి మళ్లీ మరికొందరిని పంపించాడు. వారు కూడా బుద్ధుడి ప్రభావానికి గురై ఆయనతోపాటే ఉన్నారు. ఎన్నో ఏండ్లుగా శుద్ధోధనుడు బుద్ధుడి కోసం మనుషుల్ని



పంపడం, వారు తిరిగి రాలేక బౌద్ధ భిక్కులుగా మారిపోవడం జరుగుతోంది. చివరకు పదిహేనేండ్ల తర్వాత బుద్ధుడు తన నగరానికి బయలుదేరాడు. ఆయన వస్తున్నాడని తెలిసి ప్రజలు చాలా సంతోషపడ్డారు. ఆయనకు స్వాగతం తెలిపేందుకు నగరవీధులన్నీ శుభ్రం చేయించారు. ఇండ్లను శుభ్రపరిచి పూలమాలలతో సుందరంగా అలంకరించుకున్నారు.

బుద్ధుడు వచ్చే రోజు అమావాస్య కావడంతో నగరమంతా దీపాలు వెలిగించారు. ప్రతి ఇంట్లో దీపాలు పెట్టించారు. ఏ ఇల్లు కూడా చీకట్లో ఉండకూడదని ప్రజలు దీపాలను దానం చేసి వెలుగులు నింపారు. దీంతో నగరమంతా దీపాలతో దేదీప్యమానంగా వెలిగిపోయింది. ప్రజలు దీపాలు దానం చేయడంతో దీపదానోత్సవంగా మారిపోయింది. బుద్ధుడు కపిలవస్తు నగరానికి తిరిగి రావడానికి సంకేతంగా దీపాలవెల్లి పండుగ బౌద్ధ సంప్రదాయంగా నిలిచిపోయింది. ప్రతి ఆషాఢ మాసంలో బౌద్ధ భిక్షువులకు వర్షావాసం మొదలవుతుంది. ఆ కాలంలో మూడు నెలల పాటు భిక్షువులు అడవులు, గుహల్లో ఉంటారు. దొరికింది తింటూ ధ్యానం చేసుకుంటారు. విద్యలో ప్రత్యేక స్వయం శిక్షణ పొందుతారు. మూడు నెలలు వర్షావాసం పూర్తి చేసి, తిరిగి గ్రామాలకు బయలుదేరుతారు. వారు వచ్చే దారి పొడవునా ప్రజలు దీపాలతో స్వాగతం పలుకుతారు. అదే దీపావళిగా, బౌద్ధుల ధర్మ దీపావళిగా ప్రసిద్ధి చెందింది. అప్పటి నుంచి బౌద్ధ స్తూపాల వద్ద, బౌద్ధ ఆరామాల్లో వందలాది దీపాలు వెలిగించేవారు. బౌద్ధ ధర్మోపన్యాసాలు, బౌద్ధ భిక్షువులు సమావేశాలు నిర్వహించుకునే ప్రదేశాల్లో, బౌద్ధ స్తూపాలమీద దీపాలను ఉంచేవారు.

**-అశోకుడు తెచ్చిన వైభవం..**

బౌద్ధ చరిత్ర ప్రకారం బుద్ధుడి మహాపరినిర్వాణం తరువాత ఆయన అవశేషాలు ఎనిమిది రాజ్యా లకు పంపిణీ చేశారు. మగధ రాజ్యానికి చెందిన అజాతశత్రువు, వైశాలికి చెందిన లిచ్ఛవిలు, కపిలవస్తు శాక్యులు, అల్లకప్పకు చెందిన బులిస్, రామ్‌గ్రామ్‌లోని కోలియాలకు పంచారు. భారతదేశ మూలవాసి అయిన అశోకుడు ఈ అవశేషాలను పాటలీపుత్రానికి తీసుకువచ్చాడు. భారతదేశంలో బౌద్ధ మతాన్ని పునరుజ్జీవింపజేయడానికి ఆయన దీపదానోత్సవాన్ని తిరిగి ప్రారంభించారు. 64,000 నగరాల్లో 84,000 బౌద్ధ చైత్యాలు, విహారాలు, స్తూపాలు, ఆసుపత్రులను నిర్మించారు. దీనిని డాక్టర్ వాల్మీకి ప్రసాద్ తన ‘దీప్ వంశ్’ పుస్తకంలో వివరించారు. కళింగ యుద్ధంలో విజయం సాధించినా అశోకుడు వేడుకలు చేసుకోలేదు. యుద్ధంలో పెద్ద సంఖ్యలో ప్రాణనష్టం జరగడంతో పాటు లక్షలాది మంది నిరాశ్రయులు కావడంతో పశ్చాత్తాపం చెంది దు:ఖంతో కుమిలిపోయాడు. విజయ గర్వంతో ఆయన వేడుకలు చేసుకోలేదు. ఆత్మవిమర్శ చేసుకున్నాడు. ఆయుధాలు త్యజించారు. ప్రపంచ చరిత్రలో యుద్ధాలను మానేసి శాంతియుత మార్గాన్ని అవలంభించిన ఒకే ఒక్క మహనీయుడు అశోక చక్రవర్తి. మానసిక పరివర్తన వల్ల తను చేసిన రక్తపాతానికి పరితపిస్తూ మానవతకు రూపమైన బౌద్ధమతాన్ని స్వీకరించాడు. అంధకారాన్ని పార దోలే దీపాలను వెలిగించాడు. ప్రజల జీవితాల్లో శాంతి, అహింస, సత్యం, నిజాయితీ, నిబద్ధత, నైతికతలు వెలిగిపోయేలా పరిపాలించాడు. దీనికి సంకేతంగా బుద్ధుని కాలంలో జరుపుకున్న దీపదానోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. దీపావళి ఇలా ఈ దేశంలోని ప్రజాజీవితంలోకి వచ్చింది.

**-బౌద్ధాన్ని మంటల్లో వేసేందుకే..**

ప్రపంచానికి జ్ఞానాన్ని పంచిన బుద్ధుడి రాకకు సంకేతంగా దీపదానోత్సవాన్ని నిర్వహించారనేది కాదనలేని వాస్తవం. దీనికి చారిత్రక ఆధారాలున్నాయి. ఇందులో భ్రమలు, కల్పితాలూ లేవు. బుద్ధుడు వాస్తవంగా ఈ నేలమీద తిరిగినవాడు. బుద్ధుడి కరుణను, దయాగుణాన్ని గుర్తు చేసుకోవడానికి ప్రపంచవ్యాప్తంగా బౌద్ధులు ఈ రోజు వరకూ ఆ ఉత్సవాన్ని ఘనంగా నిర్వహించుకుంటున్నారు. దీనిని తోసిపుచ్చేందుకు పురాణ గాథలను సృష్టిం చారు. శ్రీకృష్ణుడు, నరకాసురుడు, సత్యభామ, లక్ష్మి, గణేశుడు పురాణాల్లో కల్పించిన పాత్రలు. వాస్త వంగా ఈ దేశంలో పుట్టి పెరిగిన వారు కాదు. బుద్ధుడు కపిలవస్తుకు తిరిగి రావడాన్ని రాముడు అయోధ్యకు తిరిగి రావడంగా మార్చి రాసుకున్నారు. సాంకృత్యాయన్, భదంత్ కౌసల్యాయన్, విన్సెంట్ స్మిత్, గెయిల్ ఓంవేద్ తదితరుల రచనల్లో వీటి మర్మం విప్పి చెప్పారు. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ తన ‘ది ట్రయంఫ్ ఆఫ్ బ్రాహ్మణిజం’లో కూడా భారతదేశ మూలవాసుల పండుగల గురించి వివరించారు. మనుషులు చీకటి నుంచి వెలుగులోకి నడవాలి. వెలుగు నుంచి వెలుగులోకి నడవడం అంటే విజ్ఞానం నుంచి శీలం వైపు పయనించాలని దీపదానోత్సవం తెలుపుతుంది. ‘చెడును దూరం పెట్టండి, మంచిని పెంచండి. మనసును శుద్ధి చేసుకోండి.’ అన్న బుద్ధుడి మాటలను ఆచరణలో పెడితే తప్ప జ్ఞానకాంతులను కమ్మేస్తున్న ఆధిపత్య దీపాలను ఆర్పలేము.

## వరంగల్ డి.ఎం.హెచ్.ఓ డాక్టర్ బి.సాంబశివరావు కి శుభాకాంక్షలు తెలిపిన రామ రాజేష్ ఖన్నా



**వరంగల్ నవంబర్ 01: ప్రజా స్వేచ్ఛ**

వైద్య అధికారిగా ఇటీవల నూతన బాధ్యతలు చేపట్టిన డాక్టర్ బి.సాంబశివరావును జాతీయ ఆరోగ్య మిషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామ రాజేష్ ఖన్నా ఆధ్వర్యంలో శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిసి పూల గుచ్ఛం అందజేశారు. ఎన్ హెచ్ ఎం ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని ఆయన దృష్టికి తీసుకెళ్లారు. అనంతరం డి.ఎం.హెచ్.ఓ డాక్టర్ సాంబశివరావు మాట్లాడుతూ ఉద్యోగుల సమస్యలు తప్పకుండా పరిష్కరించేందుకు కృషి చేస్తానని అన్నారు. జాతీయ ఆరోగ్య మిషన్ కార్యక్రమాలు విజయవంతం చేయాలని ఉద్యోగులకు సూచించారు .ఈ కార్యక్రమంలో యూనియన్ వరంగల్ జిల్లా నాయకులు ఏకుల చిరంజీవి, హనుమకొండ జిల్లా ఎగ్జిక్యూటివ్ కమిటీ మెంబర్ ఓశపాక సందీప్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## స్వర్గీయ ఇందిరాగాంధీ విగ్రహానికి నివాళులర్పించిన కాంగ్రెస్ పార్టీ నాయకులు



**రాజపేట నవంబర్ 01: ప్రజా స్వేచ్ఛ**

రాజపేట మండల కేంద్రంలో స్వర్గీయ మాజీ ప్రధాని ఇందిరా గాంధీ విగ్రహానికి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు నమల మహేందర్ గౌడ్ పూలమాలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇందిరాగాంధీ నిరుపేదలకు భూములు, ఇండ్ల స్థలాలు ఇచ్చిందని, ప్రధానిగా పలు అభివృద్ధి కార్యక్రమాలు చేశారని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు నమిలే కేదార్ గౌడ్, ఏఎంసీ డైరెక్టర్ చిలువేరి బాలరాజు గౌడ్, ఐరన్ నవీన్ తదితరులు పాల్గొన్నారు.

## మోకు దెబ్బ గౌడ సంఘం నూతన కమిటీ సభ్యులకు సన్మానం



**ఆలేరు అక్టోబర్ 01: ప్రజా స్వేచ్ఛ**

ఆలేరు మండలం కొలనుపాక గ్రామంలోని సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ మోకు దెబ్బ గౌడ సంఘం ఆధ్వర్యంలో జిల్లా అధ్యక్షులు దూడల రమేష్ గౌడ్ ఆధ్వర్యంలో నూతన కమిటీ సభ్యులకు సన్మాన కార్యక్రమం నిర్వహించారు. వారు మాట్లాడుతూ సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ గౌడ సంఘాన్ని అభివృద్ధి చేయాలని, గౌడ కులస్తులకు ప్రభుత్వం ప్రత్యేక నిధులు కేటాయించాలని, కల్లును నీరాగా గుర్తించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆలేరు మండల అధ్యక్షుడు ప్రధాన కార్యదర్శి సంపత్, సాగర్ గౌడ్, సంతోష్ గౌడ్, బిక్షపతి గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## బాధిత కుటుంబానికి అండగా జంగిలి రవళి

**-గుండెపోటుతో మృతి చెందిన చీరబోయిన అజేందర్ కుటుంబానికి ఆర్థిక సహాయం**

**-రవళికి కృతజ్ఞతలు తెలిపిన కుటుంబ సభ్యులు...**



**ప్రజా స్వేచ్ఛ / చెన్నారావుపేట:**

వరంగల్ జిల్లా,చెన్నారావుపేట మండలం,ఉప్పరపల్లి గ్రామానికి చెందిన చీరబోయిన అజేందర్ ఇటీవల గుండెపోటుతో మృతి చెందాడు.మృతుడి కుటుంబానికి కోనాపురం గ్రామానికి చెందిన జంగిలి చంద్రు-సుభద్ర పుత్రిక రవళి 5000 రూపాయల ఆర్థిక సహాయం అందజేశారు.ఈ సందర్భంగా రవళి మాట్లాడుతూ మరణించిన అజేందర్ బంధువునని, తను సాఫ్ట్వేర్ ఉద్యోగం చేస్తూ ఉపాధి పొందుతున్న నేపథ్యంలో మృతుడి కుటుంబ ఆర్థిక పరిస్థితిపై స్పందించి ఆర్థిక సహాయాన్ని అందించానని తెలిపారు.అనంతరం మృతుడి కుటుంబ సభ్యులు యువతికి ధన్యవాదాలు తెలిపారు.

## గాంధీభవన్ లో ప్రారంభమైన కుల గణనపై సమావేశం





**-టీపీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ అధ్యక్షతన సమావేశం..**

**-పాల్గొన్న ముఖ్యమంత్రి, మంత్రులు, ఎంపీ లు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, సలహాదారులు, కార్పొరేషన్ చైర్మన్లు,**

**ప్రజా స్వేచ్ఛ**

ఏఐసీసీ నాయకులు కొప్పుల రాజు గారు సమావేశంలో కులగనన ప్రాధాన్యత వివరిస్తున్నారు.. మహేష్ కుమార్ గౌడ్, ఎమ్మెల్సీ.. టీపీసీసీ అధ్యక్షులు. కులగణన కార్యక్రమం చాలా ప్రతిష్టాత్మకంగా తీసుకోవాలి . రాష్ట్రంలో చేపట్టబోయే ఈ కార్యక్రమం దేశానికి ఆదర్శంగా నిలవబోతుంది.. ఈ కార్యక్రమాన్ని ప్రతి కార్యకర్త కీలకంగా తీసుకోవాలి..



తెలంగాణ న్యాయవాదుల హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు తరిగొప్పుల మహేందర్ ప్రజాపతి రిటైర్డ్ జడ్జి కాంగ్రెస్ నాయకుడు రంగారెడ్డి జిల్లా అధికార ప్రతినిధి

రాహుల్ గాంధీ గారు సామాజిక న్యాయం కోసం అహర్నిశలు కృషి చేస్తున్నారు. భారత్ జోడో యాత్ర లో రాహుల్ గాంధీ కులాఘననపై స్పష్టమైన ప్రకటన చేశారు.. ఏఐసీసీ. అధ్యక్షులు మల్లికార్జున్ ఖర్గే కులగణన చేపట్టాలని ఆదేశాలు ఇచ్చారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క గారు కులాఘననపై సాహసోపేత కార్యక్రమాలు తీస్కున్నారు. దీనికి పార్టీ సంపూర్ణంగా అండగా నిలబడి కార్యక్రమాలు చేపట్టాలి. నవంబర్ 2న 33 జిల్లాలో కులగణనపై డీసీసీ అధ్యక్షులు సమావేశాలు ఏర్పాటు చేసి పెద్దఎత్తున ప్రజల్లోకి తీస్కెళ్లాలి.. విద్య, ఉద్యోగ, రాజకీయ, కుల ఘనన పై ఎలాంటి అనుమానాలు ఉన్న గాంధీభవన్ లో ఒక కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసి సమాచారం ఇస్తాము..

# మరో శుభవార్త తెలిపిన తెలంగాణ ప్రభుత్వం

ప్రజా స్వేచ్ఛసిద్దిపేట

హుస్నాబాద్ నియోజకవర్గ ప్రజలకు దీపావళి నాడు తెలంగాణ ప్రభుత్వం శుభవార్త తెలిపింది. హుస్నాబాద్ ఎమ్మెల్యే, రాష్ట్ర రవాణా మంత్రి పొన్నం ప్రభాకర్ చొరవతో హుస్నాబాద్‌లోని 100 పడుకల ఆస్పత్రిని 250 పడకల ఆస్పత్రిగా మారుస్తూ కాంగ్రెస్ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు దీపావళి కానుకగా ప్రకటించింది. రూ. 82.00 కోట్లను రేవంత్ ప్రభుత్వం విడుదల చేసింది. ఈ మేరకు రాష్ట్ర హెల్త్, మెడికల్,ఫ్యామిలీ వెల్ఫేర్ డిపార్ట్మెంట్ నిధులు విడుదల చేస్తూ పరిపాలన అనుమతులు జారీ చేసింది..హుస్నాబాద్‌కి 250 పడకల ఆస్పత్రి రావడం పట్ల నియోజకవర్గ ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మీడియా సమావేశం ఏర్పాటు చేసి ఇందుకు సంబంధించిన వివరాలు తెలిపారు. హుస్నాబాద్



తెలంగాణ న్యాయవాదుల హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు తరిగొప్పుల మహేందర్ ప్రజాపతి రిటైర్డ్ జడ్జి కాంగ్రెస్ నాయకుడు రంగారెడ్డి జిల్లా అధికార ప్రతినిధి

ఆస్పత్రిని 250 పడకల ఆస్పత్రిగా మార్చడానికి సహకరించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి,ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క,వైద్యా ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహలకు ధన్యవాదాలు తెలిపారు. పేదల సంక్షేమానికి తమ ప్రభుత్వం ఎంతగానో కృషి చేస్తుందని మంత్రి పొన్నం ప్రభాకర్ వెల్లడించారు.దీపావళి పండగ కానుకగా హుస్నాబాద్ నియోజకవర్గ ప్రజలకు ప్రభుత్వం తీపికబురు తెలిపిందని అన్నారు.ప్రస్తుతం 100 పడకలతో ప్రజలకు వైద్యసేవలు అందిస్తున్న ఆస్పత్రిని 250 పడకల దవఖానాగా మారుస్తూ జీవోను ప్రభుత్వం విడుదల చేసిందని తెలిపారు.ప్రజలకు మెరుగైన వైద్యసేవలను అందుబాటులోకి తీసుకువస్తామని మంత్రి పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు..

## చెడుపై మంచి సాధించిన విజయానికి గుర్తు దీపావళి



పృథ్వి న్యూస్ : /నర్సంపేట ఆర్సీ

వరంగల్ జిల్లా నర్సంపేట పట్టణంలోని ఆర్టీసీ డిపో బస్టాండ్ ఆవరణలో గురువారం సిబ్బంది దీపావళి పూజలు నిర్వహించారు. సంప్రదాయ పద్ధతిలో మహిళా సిబ్బంది అరటి పండ్లు, మిఠాయిలు, సోంపు వాయినంగా ఇచ్చుకున్నారు. చెడుపై మంచి సాధించిన విజయానికి గుర్తుగా దీపావళి పండుగ జరుపుకుంటారని నర్సంపేట ఆర్టీసీ డిపో మేనేజర్ ప్రసూనలక్ష్మి అన్నారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ మేనేజర్ భవాని, సూపర్వైజర్లు,తదితరులు ఉన్నారు.

## జిల్లా పరిధిలో సిటీ పోలీస్ యాక్ట్ అమలు: జిల్లా ఎస్పీ




జగిత్యాల ప్రతినిధి , ప్రజా స్వేచ్ఛ

జిల్లాలో శాంతి భద్రతలను దృష్టిలో వుంచుకొని నెల రోజుల ( నవంబర్ 1వ తేది నుండి 30 వరకు) పాటు జిల్లా వ్యాప్తంగా పోలీసు యాక్ట్ అమలులో ఉంటుందని జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. దీని ప్రకారం పోలీసు అధికారుల అనుమతి లేకుండా ఎలాంటి ధర్నాలు, రాస్తా రోకోలు, నిరసనలు, ర్యాలిలు, పబ్లిక్ మీటింగ్ లు, సభలు, సమావేశాలు నిర్వహించరాదని ఎస్పీ పేర్కొన్నారు. శాంతిభద్రతలకు భంగం కలిగించే విధంగా మరియు ప్రభుత్వ ఆస్తులకు నష్టం కల్గించే చట్ట వ్యతిరేక కార్యక్రమాలు చేపట్టరాదని ఎస్.పి సూచించారు.కాబట్టి జిల్లా ప్రజలు పోలీసు వారికి ఇట్టి విషయంలో సహకరించాలని శాంతిభద్రతల పరిరక్షణ కు నిరంతరం శ్రమిస్తున్న పోలీసులకు అన్ని వర్గాల ప్రజలు సహకారం అందించాలని ఆయన కోరారు.

## సీఎం సహాయనిధి చెక్కు అందజేత

-కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు భీమనపల్లి సైదులు



మునుగోడు నవంబర్ 01: ప్రజా స్వేచ్ఛ

సీఎం సహాయనిధి చెక్కును అందజేసిన మునుగోడు మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు భీమనపల్లి సైదులు. మునుగోడు శాసనసభ్యులు కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి సహకారంతో సీఎం సహాయ నిధి నుండి మంజూరైన చెక్కును శుక్రవారం రోజున కిష్టాపురం గ్రామానికి చెందిన బుజునూరు యాదగిరి రెడ్డికి 44000 వేల రూపాయల చెక్కును అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ శాఖ అధ్యక్షుడు మునుకుంట్ల పరమేష్, భీమనపల్లి ఎల్లయ్య, వేముల యాదగిరి, మునుకుంట్ల అంజయ్య, శ్రీను, రాఘవులు, లింగస్వామి, పరమేష్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య స్వదేశాగమనం

స్వాగతం పలికిన ఏఎంసీ చైర్మన్ అయినాల చైతన్య రెడ్డి



ఆలేరు అక్టోబర్ 01: ప్రజా స్వేచ్ఛ

ప్రభుత్వ విప్ ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య విదేశీ పర్యటన ముగించుకొని సదేశానికి తిరిగి వచ్చిన సందర్భంగా ఆలేరు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ అయినా ఎలా చైతన్య రెడ్డి మహేందర్ రెడ్డి దంపతులు రాజీవ్ గాంధీ విమానాశ్రయంలో వారికి పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# దీపావళి సందర్భంగా జియో ఇంటర్నెట్

## వినియోగదారుల కోసం కొత్త ఆఫర్

ప్రజా స్వేచ్ఛ

అత్యధిక వినియోగదారులతో భారతదేశంలో నంబర్ 1 ప్లేయర్ అయిన రిలయన్స్ జియో తన కస్టమర్లకు దీపావళి ఆఫర్లను అందిస్తోంది. ఇప్పటికే పలు ఆఫర్లను ప్రకటించిన ముకేశ్ అంబానీకి చెందిన రిలయన్స్ జియో ఇప్పుడు ఏడాది పాటు ఉచిత ఇంటర్నెట్‌ను అందజేస్తున్నట్లు ముఖ్యమైన ప్రకటన చేసింది. ధరల పెంపుతో వినియోగదారులను కోల్పోతున్న జియో.. తక్కువ ధరలకే నాణ్యమైన సేవలను అందిస్తూ వినియోగదారులను ఆదుకునేందుకు ప్రయత్నిస్తోంది. దీపావళి సందర్భంగా ఇంటర్నెట్ వినియోగదారుల కోసం కొత్త ఆఫర్ వచ్చింది. ఈ ఆఫర్ కింద కస్టమర్లు డేటాను ఉచితంగా ఉపయోగించుకోవచ్చు. వినియోగదారులు అపరిమిత 5%+% డేటాతో పాటు హై స్పీడ్ ఇంటర్నెట్ సౌకర్యం కూడా పొందుతారు. దీపావళి ఆఫర్ కింద, %జీఱశీ% కస్టమర్‌లు 1 సంవత్సరం పాటు ఉచిత అపరిమిత ఇంటర్నెట్‌ని పొందుతారు. ఈ ఆఫర్ మీదే అయితే కస్టమర్లు రూ. 20 వేల వరకు షాపింగ్ చేయవచ్చు. జియో దీపావళి ఆఫర్‌ని పొందడానికి, కస్టమర్ మై





స్టోర్ నుండి రూ. 20,000 విలువైన కొనుగోలు చేస్తే 1-సంవత్సరం ఉచిత ఇంటర్నెట్ ఆఫర్ యాక్టివేట్ చేయబడుతుంది. నివేదికల ప్రకారం, ఈ 1 సంవత్సరం ఆఫర్ నవంబర్ 3 వరకు మాత్రమే అందుబాటులో ఉంటుంది. నవంబర్ 3లోపు మై స్టోర్ నుండి 20 వేల రూపాయలు కొనుగోలు చేయాలి. ఇక్కడ షాపింగ్ చేయండి మరియు ప్రత్యేక ఆఫర్‌ను పొందండి ఇది మాత్రమే కాదు, దీపావళి ప్రత్యేక ఆఫర్ కింద ఎయిర్ ఫైబర్ ప్లాన్ వినియోగదారులకు అందించబడుతుంది. ఎలాంటి రుసుము చెల్లించకుండానే 3 నెలల ప్యాకేజీని వినియోగదారులకు అందిస్తున్నారు. కొత్త కస్టమర్లకు ఉచిత ఇంటర్నెట్ సౌకర్యాన్ని కూడా అందుబాటులోకి



తెలంగాణ న్యాయవాదుల హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు తరిగొప్పుల మహేందర్ ప్రజాపతి రిటైర్డ్ జడ్జి కాంగ్రెస్ నాయకుడు రంగారెడ్డి జిల్లా అధికార ప్రతినిధి

తెస్తున్నారు. Jio Saavn Music మూడు నెలల ఉచిత ఆఫర్‌ను కూడా ప్రారంభించింది. జియో భారత్ 4జీ ఫోన్ రూ.699 Jio తన భారత్ 4G ఫోన్‌ల ధరలను తగ్గించింది. ఫలితంగా Jio Bharat 4G ఫోన్ ఇప్పుడు కేవలం 699 రూపాయలకే అందుబాటులో ఉంది. దీపావళి పండుగ సందర్భంగా, Jio Bharat 4G ఫోన్ ధరలు 30 శాతం తగ్గింపు. ఇది పరిమిత కాల ఆఫర్.

# సమగ్ర కుటుంబ సర్వే ను పరిశీలించిన జిల్లా కలెక్టర్

జగిత్యాల ప్రతినిధి(కొడిమ్యాల )ప్రజా స్వేచ్ఛ

జిల్లాలో సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే లో ఎలాంటి అవాంతరాలకు తావు లేకుండా పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ బి. సత్య ప్రసాద్ తెలిపారు. శుక్రవారం రోజున కోడిమ్యాల మండలంలోని పూడూర్ గ్రామంలో జరుగుతున్న సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే లో జిల్లా కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ సర్వే చేస్తున్న ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యుల వివరాలు పక్కాగా నమోదు చేస్తున్నారా అని కలెక్టర్ పరిశీలించారు. సర్వే అయిన ప్రతి ఇంటి గోడ పైన ఖచ్చితంగా స్టిక్కర్ అంటించాలని తెలిపారు. పత్రంలో ఉన్న ప్రశ్నలను సరిగ్గా నింపుతున్నారా లేదా అని ఫామ్ ను తీసుకొని



కలెక్టర్ పరిశీలించారు. ప్రతి ఇంటిలోని మర్యాదపూర్వకంగా వ్యవహరిస్తూ ఓపికతో ప్రతి కుటుంబం నుండి స్పష్టత కలిగిన సమాధానాలను సేకరించాలని, సర్వే జరుగుతున్న సమయంలో కుటుంబ యజమానికి వారి వద్ద నుంచి సేకరించే సమాచారం గోప్యంగా ఉంచబడుతుందని వారికి అర్థం అయ్యే విధంగా తెలియజేయాలని సూచించారు. నింపిన షెడ్యూల్ ఫారంలోని జాగ్రత్తగా భద్రపరచాలని, ఈ డేటా ఇతరులతో ఎట్టి పరిస్థితుల్లోనూ పంచుకోకూడదని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో మధు సుధన్, తహసిల్దార్, ఎంపీడీవో, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# బీసీ జన గర్జన సభను విజయవంతం చేయండి

నేరేడు చర్ల ప్రజా స్వేచ్ఛ పత్రిక ప్రతినిధి :

ఈనెల మూడవ తేదీన మిర్యాలగూడలో జరగనున్న బీసీ గర్జన సభను జయప్రదం చేయాలని బీసీ హక్కుల సాధన సమితి తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ధూళిపాళ ధనుంజయ నాయుడు పిలుపునిచ్చారు. శుక్రవారం నాడు ఆయన సూర్యాపేట జిల్లా నేరేడుచర్ల మున్సిపల్ కేంద్రంలో జరిగిన కార్నర్ మీటింగ్ లో ఆయన మాట్లాడుతూ బీసీల మధ్య ఐక్యత లేకపోవడం వల్లనే స్వాతంత్ర్యం వచ్చిన ఈ 77 సంవత్సరాల కాలంలో బీసీలలోని అనేక కులాలను ఇంతవరకు పార్లమెంటు మరియు అసెంబ్లీ గడప తాకనివ్వకుండా అగ్రవర్ణాలు తీవ్రంగా కృషి చేస్తున్నాయని ఆయన అన్నారు. ఇటీవల కాలంలో కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన . ఈ బీ సీ పేరుతో మన పిల్లల భవిష్యత్తును కూడా నాశనం చేశారని నామినేట్ పోస్టులో కూడా చిప్ప చేతికి ఇచ్చారని అందువల్ల బీసీలు అంతా పోరుబాట పట్టాలని ఆయన కోరారు. 8 దశాబ్దాల భారత స్వాతంత్ర చరిత్రలో బీసీ ప్రజల సంక్షేమం ఎవరికీ పట్టని విధంగా ఉందని బీసీలకు రిజర్వేషన్ పెంచడం చట్టసభల్లో రాజకీయ రిజర్వేషన్



బిల్లు లాంటివి ఎవరికి పట్టడం లేదని జనాభాలో 56% బీసీలకు కనీసం50% రాజకీయ రిజర్వేషన్ కల్పించడం ద్వారా వారి అభివృద్ధికి పాటుపడాల్సిన పాలకులు కల్లబొల్లి మాటలు చెబుతున్నాయని అందువల్ల భేషజాలు మరిచిపోయి అన్ని వర్గాల బీసీలు ఐక్యమై మూడో తేదీ జరిగే బీసీ గర్జన ను విజయవంతం చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో సంఘం ఉపాధ్యక్షులు బొడ్డుపల్లి సుందరయ్య మాజీ సర్పంచ్ ఆకారపు వెంకటేశ్వర్లు, మత్స్య పారిశ్రామిక సంఘం జిల్లా నాయకులు యామిని వీరయ్య సంఘం మండల అధ్యక్షుడు తునికి పాటి మల్లాచారి , యువజన నాయకులు బీసీ నాయకులు తాళ్లూరి రమేష్ తునికి పాటి జగన్నాథచారి చిలకరాజు శ్రీను కొమ్మరాజు వెంకట్, గౌడ సంఘం జిల్లా నాయకులు బుడిగే చంద్రయ్య బత్తిని శ్రీనివాస్ యర్రమాద శేఖర్, చంద్ర చారి తదితరులు పాల్గొన్నారు.

## బిజినెస్

# గూగుల్‌కు సవాల్.. కొత్త సెర్చింజన్ చాట్‌జీపీటీ..!

ప్పటి వరకూ అంతర్జాతీయంగా, జాతీయంగా మనకు తెలియని విషయాల గురించి తెలుసుకోవాలంటే సెర్చింజన్ 'గూగుల్' శరణ్యం.. 'గూగులమ్మ'.. 'గూగుల్ తల్లి'ని అడిగేస్తే ఏ విషయమైనా తెలుస్తుందని చెబుతుంటారు. దశాబ్దాల తరబడి ఇంటర్నెట్ రంగంలో 'సెర్చింజన్'గా ఆధిపత్యం ప్రదర్శిస్తున్న గ్లోబల్ టెక్ దిగ్గజం 'గూగుల్'కు గట్టి పోటీ ఎదురవుతోంది. అదీ ఒక స్టార్టప్ సంస్థ నుంచి పోటీ వస్తోంది. ఇప్పుడు టెక్నాలజీ రంగంలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) చాట్ బోట్ కీలకంగా మారింది.మరో టెక్ దిగ్గజం మైక్రోసాఫ్ట్ వెన్ను దన్నుతో ఏఐ బేస్డ్ చాట్‌జీపీటీ ని ఓపెన్ ఏఐ (Open AI అనే స్టార్టప్ సంస్థ రెండేండ్ల క్రితం వెలుగులోకి తీసుకొచ్చింది. వచ్చీ రావడంతోనే సంచలనాలు క్రియేట్ చేసింది ఓపెన్ ఏఐ.. చాట్‌జీపీటీ. ప్రతి అంశంపైనా అథంటిక్ సమాచారాన్ని అందిస్తూ గూగుల్‌కు పోటీగా నిలిచింది. తాజాగా గూగుల్‌తో పోటాపోటీ సమాచారం నెటిజన్లకు అందించేందుకు సెర్చింజన్ సామర్థ్యంతో కూడిన ఏఐ చాట్‌బోట్‌ను




ఆవిష్కరిస్తోంది చాట్‌జీపీటీ జనరేటివ్. సంబంధిత వెబ్ సోర్సెస్ కూడిన లింకులతో శరవేగంగా, సమయానుకూల సమాధానాలు ఇచ్చేలా ఓపెన్ ఏఐ చాట్‌జీపీటీ జనరేటివ్‌ను అప్ గ్రేడ్ చేస్తున్నది. ఇంతకు ముందు అందుబాటులో ఉన్న సంప్రదాయ సెర్చింజన్ నుంచే వెబ్ సోర్సెస్ ఉపయోగించుకోనున్నది ఓపెన్ ఏఐ. చాట్‌జీపీటీ హోమ్ పేజ్ యూజర్లకు అవసరమైన టాపిక్స్ మీద నేరుగా ట్యాబ్ ఆప్షన్లు అందిస్తుంది. వాతావరణ పరిస్థితులు, వివిధ స్టాక్స్ ధరలు, స్పోర్ట్స్ స్కోర్లు, బ్రేకింగ్ న్యూస్ తదితర విషయాలపై ట్యాబ్స్ ఉంటాయని ఓపెన్ ఏఐ తెలిపింది. చాట్‌జీపీటీతో అవసరమైన సమాచారం కోసం ఓపెన్ ఏఐతో ఫ్రాన్స్ లీ మొండె, జర్మనీ యాక్సెల్ స్ప్రింగర్, బ్రిటన్ ఫైనాన్సియల్ టైమ్స్ తదితర సంస్థలు కంటెంట్ డీల్ పై సంతకాలు చేశాయి. చాట్‌జీపీటీ.కామ్ వెబ్ సైట్ తోపాటు మొబైల్ యాప్ లోనూ ఈ ఫెసిలిటీ లభిస్తుందని ఓపెన్ ఏఐ వెల్లడించింది చాట్‌జీపీటీ ప్లస్, చాట్‌జీపీటీ టీమ్ యూజర్లు, సెర్చ్ జీపీటీ వెయిట్ లిస్ట్ యూజర్లకు ఈ సౌకర్యం తక్షణం అందుబాటులోకి తెస్తున్నమని పేర్కొంది. కొన్ని వారాల్లో ఎంటర్ ప్రైజెస్, ఎడ్యుకేషనల్ యూజర్లకు అందుబాటులోకి వస్తున్న ఈ సౌకర్యం.. చాట్‌జీపీటీని ఫ్రీగా వాడుకునే యూజర్లకు చేరువ చేయడానికి కొన్ని నెలల టైం పడుతుందని ఓపెన్ ఏఐ వివరించింది.

# అక్టోబర్‌లో అత్యధిక జిఎస్‌టి వసూళ్లు



న్యూఢిల్లీ : అక్టోబర్ నెలలో జిఎస్‌టి వసూళ్లు రూ.1.87 కోట్లను అధిగమించాయి. గతేడాదిలో అక్టోబర్‌తో పోలిస్తే.. 9 శాతం పెరిగినట్లు ఆర్థిక శాఖ శుక్రవారం విడుదల చేసిన నివేదికలో పేర్కొంది. గతేడాది అక్టోబర్‌లో రూ 1.72 లక్షల కోట్లు వసూలయ్యాయి. సెప్టెంబర్ నెలలో 40 నెలల కనిష్ట స్థాయి 6.5 శాతం నుండి అక్టోబర్‌లో 8.9 శాతానికి వృద్ధి పుంజుకోవడంతో, రెండవ అత్యధిక నెలవారీ వసూళ్లుగా రికార్డు నమోదైంది. సిజిఎస్‌టి, ఎస్‌జిఎస్‌టి, ఐజిఎస్‌టి మరియు సెస్ అక్టోబర్‌లో పెరిగినట్లు నివేదిక పేర్కొంది 2024లో ఇప్పటివరకు, మొత్తం జిఎస్‌టి వసూళ్లు 9.4 శాతం పెరిగి రూ.12.74 లక్షల కోట్లకు చేరాయి. 2023లో ఇదే సమయంలో రూ.11.64 లక్షల కోట్లు వసూలయ్యాయి. ఈ ఏడాది ఏప్రిల్‌లో జిఎస్‌టి రికార్డు గరిష్ట స్థాయి రూ. 2.10 లక్షల కోట్లకు చేరుకున్న సంగతి తెలిసిందే. 2023-24 ఆర్థిక సంవత్సరంలో, స్థూల జిఎస్‌టి వసూళ్లు గత ఆర్థిక సంవత్సరంతో పోలిస్తే 11.7 శాతం పెరుగుదలతో రూ. 20.18 లక్షల కోట్లుగా నమోదయ్యాయి. దేశీయ లావాదేవీల నుండి జిఎస్‌టి 10.6 శాతం వృద్ధి చెంది రూ.1.42 లక్షల కోట్లకు చేరుకుంది, అయితే అక్టోబర్ 2024లో దిగుమతులపై పన్ను దాదాపు 4 శాతం పెరిగి రూ.45,096 కోట్లకు చేరుకుంది.

# జీఎస్టీ వసూళ్లలో రెండో గరిష్టం..

## రూ.1.87 లక్షల కోట్ల వసూళ్లు..!

అక్టోబర్ నెలలో స్థూల జీఎస్టీ వసూళ్లు రికార్డు నెలకొల్పాయి . దేశీయ విక్రయాలు పుంజుకోవడంతో గత నెలలో జీఎస్టీ వసూళ్లు తొమ్మిది శాతం వృద్ధి చెంది రూ.1.87 లక్షల కోట్లకు చేరాయి. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2024-25)లో ఇది రెండో గరిష్టం. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ప్రారంభ నెల ఏప్రిల్‌లో రూ.2.10 లక్షల కోట్లు వసూలు కావడమే గరిష్టం.ఇక గత నెల జీఎస్టీ వసూళ్లలో సెంట్రల్ జీఎస్టీ రూ.33,821 కోట్లు, రాష్ట్ర జీఎస్టీ రూ.41,864 కోట్లు, ఇంటిగ్రేటెడ్ ఐజీఎస్టీ రూ.99,111 కోట్లు, సెస్ రూ.12,550 కోట్లు వసూళ్లయ్యాయి. గత నెలలో




జీఎస్టీ వసూళ్లు 8.9 శాతం పెరిగి రూ.1,87,346 కోట్లకు చేరుకున్నాయి. గతేడాది అక్టోబర్ నెలలో రూ.17.2 లక్షల కోట్ల జీఎస్టీ వసూళ్లు నమోదయ్యాయి. దేశీయ లావాదేవీల ద్వారా జీఎస్టీ వసూళ్లు 10.6 శాతం వృద్ధితో రూ.1.42 లక్షల కోట్లు, విదేశాల నుంచి వస్తువుల దిగుమతి ద్వారా రూ.45,096 కోట్లు వసూలయ్యాయి. 2023-24తో పోలిస్తే గత నెలలో రీఫండ్స్ 18.2 శాతం పెరిగి రూ.19,306 కోట్లకు చేరాయి. రీఫండ్స్ సర్దుబాట్లతో నికర జీఎస్టీ వసూళ్లు 8 శాతం వృద్ధితో రూ.1.68 లక్షల కోట్లకు చేరాయి.

# తెలుగువాడిగా సన్‌రైజర్స్ హైదరాబాద్ జట్టుకే ఆడాలనుకున్నా

**-యువ ఆల్‌రౌండర్ నితీష్ కుమార్ రెడ్డి**



తెలుగువాడిగా తెలుగు రాష్ట్రాలకు ప్రాతినిథ్యం వహిస్తున్న సన్‌రైజర్స్ హైదరాబాద్ జట్టుకే ఆడాలనుకున్నానని యువ ఆల్‌రౌండర్ నితీష్ కుమార్ రెడ్డి తెలిపాడు. ఈ క్రమంలోనే రూ. 6 కోట్ల తక్కువ రిటెన్షన్‌కు ఒప్పుకున్నానన్నాడు. ఇతర జట్ల నుంచి మంచి ఆఫర్స్ వచ్చినా.. కెరీర్ ఆరంభంలో తనపై నమ్మకం ఉంచి అవకాశాలు ఇచ్చిన సన్‌రైజర్స్ హైదరాబాద్‌కు ఆడాలనుకున్నానని స్పష్టం చేశాడు. ఐపీఎల్ 2025 మెగా వేలానికి సంబంధించిన రిటెన్షన్ జాబితాను సన్‌రైజర్స్ హైదరాబాద్ గురువారం ప్రకటించింది. అందరూ ఊహించినట్లుగానే విధ్వంసకర వికెట్ కీపర్ హెన్రీచ్ క్లాసెన్‌తో పాటు కెప్టెన్ ప్యాట్ కమిన్స్, విధ్వంసకర ఓపెనర్లు ట్రావిస్ హెడ్, అభిషేక్ శర్మ, యువ ఆల్‌రౌండర్ నితీష్ కుమార్ రెడ్డిలను సన్‌రైజర్స్ హైదరాబాద్ రిటైన్ చేసుకుంది.హెన్రీచ్ క్లాసెన్‌ను రూ. 23 కోట్ల భారీ ధరకు రిటైన్ చేసుకున్న ఆరెంజ్ ఆర్మీ.. ప్యాట్ కమిన్స్, అభిషేక్ శర్మ, ట్రావిస్ హెడ్‌లను రూ. 14 కోట్లకు అట్టిపెట్టుకుంది. సంచలన ప్రదర్శనతో టీమిండియా స్టార్‌గా ఎదిగిన నితీష్ కుమార్ రెడ్డిని మాత్రం రూ. 6 కోట్లకే రిటైన్ చేసుకుంది. నితీష్ కుమార్ రెడ్డి వేలంలోకి వచ్చి ఉంటే సునాయసంగా రూ. 10 కోట్లకు పైగా పలికేవాడు. కానీ అతను రూ. 6 కోట్ల రిటెన్షన్‌కు ఒప్పుకోవడం అందర్నీ ఆశ్చర్యపరిచింది. తక్కువ ధర రిటెన్షన్‌కు ఒప్పుకోవడానికి గల కారణాన్ని నితీష్ కుమార్ రెడ్డి తాజాగా వెల్లడించాడు. ఓ జాతీయ ఛానెల్‌తో మాట్లాడుతూ.. సన్‌రైజర్స్ హైదరాబాద్ ఫ్రాంచైజీ అందించిన అవకాశాలు.. ఆ జట్టు అభిమానుల అండతోనే తాను ఈ స్థాయికి చేరానని తెలిపాడు. వారిని మరింత అలరించేందుకే తక్కువ ధర అయినా రిటెన్షన్‌కు ఒప్పుకున్నానని వివరించాడు.'సన్‌రైజర్స్ హైదరాబాద్ తరఫున ఆడటం నాకెంతో గర్వకారణం. తెలుగు మాట్లాడే వ్యక్తిగా.. నేను నా ప్రాంతానికి ప్రాతినిథ్యం వహించడం, సన్‌రైజర్స్ హైదరాబాద్ తరఫున ఆడటం గొప్పగా భావిస్తాను. ప్రైజ్ ట్యాగ్ నాకు అనవసరం. నా ఫోకస్ అంతా అత్యుత్తమ ప్రదర్శనతో జట్టును గెలిపించడంపైనే ఉంది. ఇతర ఫ్రాంచైజీల నుంచి నాకు చాలా ఆఫర్స్ వచ్చాయి. కానీ ఇతర ఫ్రాంచైజీలకు ఆడాలని నేను ఎప్పుడూ అనుకోలేదు. సన్‌రైజర్స్ హైదరాబాద్‌కు మాత్రమే ఆడాలనుకున్నాను. నాపై నమ్మకం ఉంచి సన్‌రైజర్స్ హైదరాబాద్ అవకాశాలు ఇచ్చింది. ఆ నమ్మకాన్ని నిలబెట్టుకోని తిరిగి ఇవ్వాల్సిన బాధ్యత నాపై ఉంది.'అని నితీష్ కుమార్ రెడ్డి చెప్పుకొచ్చాడు.

# మురిసిన యు ముంబా

**-39-37తో జైపూర్‌పై గెలుపు**




హైదరాబాద్: మాజీ చాంపియన్ల పోరులో యు ముంబా పైచేయి సాధించింది. 39-37తో జైపూర్ పింక్ పాంథర్స్‌పై రెండు పాయింట్ల తేడాతో యు ముంబా మెరుపు విజయం సాధించింది. గురువారం గచ్చిబౌలిలోని జిఎంసీ బాలయోగి ఇండోర్ స్టేడియంలో జరిగిన ప్రొ కబడ్డీ లీగ్ 11వ సీజన్ లీగ్ దశ మ్యాచ్‌లో యు ముంబా రెయిడర్ అజిత్ చౌహాన్ (14 పాయింట్లు) సూపర్ టెన్ షోతో అదరగొట్టడంతో ఆ జట్టు పీకెఎల్ 11వ సీజన్లో రెండో విజయం సాధించింది. జైపూర్ పింక్ పాంథర్స్ తరఫున నీరజ్ నర్వాల్ (12 పాయింట్లు) సూపర్ టెన్ ప్రదర్శనతో ఆకట్టుకున్నాడు. జైపూర్ పింక్ పాంథర్స్‌కు ఐదు మ్యాచుల్లో ఇది రెండో ఓటమి. మరో మ్యాచ్‌లో దబంగ్ ఢిల్లీపై పట్నా పైరేట్స్ 44-30తో ఏకపక్ష విజయం సాధించింది. దేవాంక్ (12 పాయింట్లు), అయాన్ (12 పాయింట్లు) కూతలో అదరగొట్టారు. 14 పాయింట్ల తేడాతో పట్నా పైరేట్స్ తిరుగులేని విజయం నమోదు చేసింది. ప్రొ కబడ్డీ లీగ్‌లో నేడు బెంగళూర్ బుల్స్‌తో తెలుగు టైటాన్స్ తలపడనుంది.

## స్పోర్ట్స్

# వెస్టిండీస్ చేతిలో ఇంగ్లండ్ ఘోర పరాజయం



విండీస్ సంచలన విజయం సాధించింది. లియామ్ లివింగ్‌స్టన్, ఫిల్ సాల్ట్, విల్ జాక్స్, సామ్ కర్రన్, జోఫ్రా ఆర్చర్, ఆదిల్ రషీద్ లాంటి స్టార్ ఆటగాళ్లతో పటిష్టంగా ఉన్న ఇంగ్లండ్‌ను ఆతిథ్య జట్టు చావుదెబ్బ తీసింది. డక్‌వర్త్ లూయిస్ పద్ధతిలో 8 వికెట్ల తేడాతో గెలిచి సిరీస్‌లో 1-0తో ఆధిక్యంలోకి దూసుకెళ్లింది.మొదటి వన్డేలో టాస్ నెగ్గిన వెస్టిండీస్ తొలుత బౌలింగ్ చేయాలని డిసైడ్ అయింది. కెప్టెన్ షై హోప్ నిర్ణయం సరైనదేనని ఆ జట్టు బౌలర్లు నిరూపించారు. పేసర్లు మాథ్యూ ఫోర్డ్ (2/48), జేడెన్ సీల్స్ (2/22), అల్జారీ జోసెఫ్ (2/46) చెలరేగి బౌలింగ్ చేశారు. వీళ్ల దెబ్బకు 93 పరుగులకు 4 వికెట్లు కోల్పోయింది ఇంగ్లండ్. ఆ తర్వాత సారథి లివింగ్‌స్టన్ (48), సామ్ కర్రన్ (37) కాసేపు పోరాడారు. కానీ స్పిన్నర్ గుడకేష్ మోతీ (4/41) ఎంట్రీతో సీన్ పూర్తిగా మారిపోయింది. వరుసగా వికెట్లు తీస్తూ పోయాడతను. లివింగ్‌స్టన్, కర్రన్‌తో పాటు మోస్లీ, ఓవర్టన్‌ను ఔట్ చేసి ఇంగ్లండ్ పతనాన్ని శాసించాడు. విండీస్ బౌలర్ల దెబ్బకు పర్యాటక జట్టు 45.1 ఓవర్లలో 209 పరుగులకు ఆలౌట్ అయింది.కష్టసాధ్యం కాని లక్ష్యంతో ఛేజింగ్ స్టార్ట్ చేసిన వెస్టిండీస్ ఆరంభం నుంచి దూకుడుగా ఆడుతూ వచ్చింది. బ్రెండన్ కింగ్ (30) అండతో చెలరేగిపోయాడు ఎవిన్ లూయిస్ (69 బంతుల్లో 94). వచ్చిన బంతిని వచ్చినట్లు బౌండరీ లైన్ దాటిస్తూ పోయాడు. 5 ఫోర్లు, 8 భారీ సిక్సులతో ప్రత్యర్థి బౌలర్లకు చుక్కలు చూపించాడు. ఆ తర్వాత ఇద్దరు ఓపెనర్లు స్వల్ప వ్యవధిలో వెనుదిరిగినా.. కీసీ కార్టీ (19 నాటౌట్), కెప్టెన్ హోప్ (6 నాటౌట్) మిగిలిన పనిని పూర్తి చేశారు. కాగా, ఇంగ్లండ్ బ్యాటింగ్ ఆర్డర్ వెన్ను విరిచిన స్పిన్నర్ మోతీ ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్‌గా నిలిచాడు.




## వాయమ్మో.. ఏం మారింది గురూ.. హుషారు మూవీ హీరోయిన్

ఎలాంటి అంచనాలు లేకుండా చిన్న సినిమాగా విడుదలై మంచి రెస్పాన్స్ సొంతం చేసుకున్న చిత్రం హుషారు. శ్రీహర్ష కొనుగంటి దర్శకత్వం వహించిన ఈ మూవీ ప్రేక్షకులను ఆకట్టుకుంది. ఇందులో తేజస్ కంచర్ల, తేజ్ కూరపాటి, అభినవ్ మేడిశెట్టి, దినేష్ తేజ, ప్రియా వడ్లమాని, హేమ ఇంగల్, రాహుల్ రామకృష్ణ, దక్ష నాగర్కర్ కీలకపాత్రలు పోషించారు. యూత్ ఎంటర్టైనర్ గా వచ్చిన ఈ చిత్రం ప్రేక్షకులను మెప్పించింది. ఈ సినిమాతో చాలా మంది యంగ్ స్టర్స్ ఫేమస్ అయ్యారు. అపేందులో ప్రియా వడ్లమాని ఒకరు. ఈ చిత్రంలో ఆమెది నెగిటివ్ షేడ్స్ ఉన్న క్యారెక్టర్.ఇందులో ప్రేమించిన వాడిని మోసం చేసే పాత్రలో కనిపించి అలరించింది. మోడ్రన్ అమ్మాయిగా నటించింది ప్రియా వడ్లమాని. 2018లో వచ్చిన ప్రేమకు రెయిన్ చెక్ సినిమాతో సినీరంగంలోకి అడుగుపెట్టింది. ఆ తర్వాత శుభలేఖలు, హుషారు చిత్రాల్లో నటించింది. అయితే హుషారు సినిమాతో ఈ బ్యూటీకి తెలుగులో మంచి క్రేజ్ వచ్చింది. ఒక్క సినిమాతోనే చాలా మంది ఫేవరెట్ హీరోయిన్ గా మారిపోయింది. కానీ తెలుగులో ఆశించినంత అందుకోలేకపోయింది. చివరిసారిగా ఈ బ్యూటీ ఓం భీమ్ బుష్ చిత్రంలో నటించింది. ప్రస్తుతం బ్రహ్మానందం అనే సినిమాలో నటిస్తుంది. ఇదిలా ఉంటే..సోషల్ మీడియాలో ప్రియా వడ్లమాని చాలా యాక్టివ్. నెట్టింట ఎప్పటికప్పుడు లేటేస్ట ఫోటోస్ షేర్ చేస్తూ అభిమానులను ఆకట్టుకుంటుంది. తాజాగా ఈ బ్యూటీ షేర్ చేసిన పిక్స్ వైరలవుతుండగా నెటిజన్స్ ఆశ్చర్యపోతున్నారు




## సంక్రాంతికి టపాసులు పేలుద్దాం


'ఎఫ్ 2', 'ఎఫ్ 3' చిత్రాల సక్సెస్ తర్వాత విక్టరీ వెంకటేశ్ - దర్శకుడు అనిల్ రావిపూడి కాంబినేషన్‌లో ఓ సినిమా తెరకెక్కుతోన్న విషయం తెలిసిందే. శ్రీవేంకటేశ్వర క్రియేషన్స్ పతాకంపై దిల్ రాజు దీనిని నిర్మిస్తున్నారు. తాజాగా ఈ సినిమా ఫస్ట్ లుక్ పోస్టర్, టైటిల్‌ను చిత్రబృందం విడుదల చేసింది. ఈ చిత్రానికి 'సంక్రాంతికి వస్తున్నాం' అనే పేరు ఖరారు చేశారు. దీనికి సంబంధించిన పోస్టర్ విడుదల చేసి, 2025లో సంక్రాంతి పండుగకు సినిమాను రిలీజ్ చేయబోతున్నాం అని తెలిపారు. అనిల్ రావిపూడి మార్క్ ఫన్, ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌గా ఈ సినిమా సిద్ధమవుతోంది. మీనాక్షి చౌదరి, ఐశ్వర్య రాజేశ్ కీలక పాత్రల్లో కనిపించనున్నారు. అనిల్ రావిపూడి వెంకటేశ్ కాంబినేషన్‌లో వచ్చిన ఎఫ్2 చిత్రం 2019 సంక్రాంతికి ప్రేక్షకుల ముందుకొచ్చింది. తదుపరి సరిలేరు నీకెవ్వరూ' చిత్రాన్ని 2020 సంక్రాంతికి విడుదల చేశారు. మూడేళ్ల తర్వాత మళ్లీ ఆయన చిత్రం సంక్రాంతికి రానుంది. ఈ సినిమా గురించి దర్శకుడు అనిల్ రావిపూడి ట్వీట్ చేశారు. "ప్రేక్షకుల ఆశీస్సులు, సపోర్ట్‌తో మరోసారి సంక్రాంతి రాబోతున్నాం. ఈసారి సంక్రాంతికి మరింత థ్రిల్, ఫన్‌ను అందించబోతున్నాం. ఈ సారి నవ్వుల టపాసులు సంక్రాంతికి పేలుద్దాం" అని పేర్కొన్నారు.



## ఇది ఊహకందని కథ

### -సింహంతో రాజమౌళి

ఏ సినిమాకైనా కథే బలం. అందుకే మూవీ రిలీజ్ అయ్యే వరకు స్టోరీ ఏంటో రివీల్ కాకుండా జాగ్రత్త పడుతుంటారు మేకర్స్. కొందరు దర్శకులైతే స్టోరీ లైన్ ఏంటో రివీల్ చేసేందుకు కూడా ఇష్టపడరు. అయితే దర్శకధీరుడు ఎస్ఎస్ రాజమౌళి మాత్రం దీనికి పూర్తి విభిన్నమనే చెప్పాలి. సినిమా సెట్స్ మీదకు వెళ్లకముందే కథ చెప్పేస్తాడు జక్కన్న. హీరోతో కలసి ప్రెస్ మీట్ పెట్టి మరీ తాము ఏం తీయబోతున్నామో వివరిస్తాడు. సినిమా కథ ఎలా సాగుతుంది, చిత్రం నుంచి ఏమేం ఆశించొచ్చో ముందే చెప్పేసి అందుకు తగ్గట్లుగా ఆడియెన్స్‌ను ప్రిపేర్ చేస్తాడు. కథ ఏంటనేది చెప్పినా కళ్లుచెదిరే విజువల్స్, అదిరిపోయే యాక్షన్ సీక్వెన్స్‌లు, సంభ్రమాశ్చర్యాలకు గురిచేసే గ్రాఫిక్స్, అద్భుతమైన మేకింగ్‌తో థియేటర్లకు వచ్చిన ప్రేక్షకుల్ని సీట్లకు కట్టిపడేస్తాడు రాజమౌళి. రాజమౌళిలా స్టోరీ ముందే చెప్పి ఆడియెన్స్‌ను బిగ్ స్క్రీన్స్‌కు రప్పించడం, ఒకవేళ వచ్చినా మూడు గంటల పాటు కళ్లు తిప్పుకోకుండా ఎంటర్‌టైన్ చేయడం అంత ఈజీ కాదు. అందుకే ఇతర దర్శకుల కంటే జక్కన్న ఎంతో స్పెషల్ అనే ముద్ర వేయించుకున్నాడు. వరుస పాన్ ఇండియా హిట్స్‌తో దూసుకెళ్తున్న దర్శకధీరుడు ఇప్పుడు సూపర్‌స్టార్ మహేష్ బాబుతో తెరకెక్కించనున్న 29 చిత్రం పనుల్లో బిజీగా ఉన్నాడు. నిత్యం వార్తల్లో నిలుస్తున్న ఈ ప్రాజెక్ట్ గురించి రాజమౌళి ఇంట్రెస్టింగ్ అప్‌డేట్ ఇచ్చాడు. ఒక్క ఫొటోతో మూవీ కథ ఏంటో చెప్పేశాడు.



## లండన్‌లో ప్రియాంక దీపావళి వేడుకలు

బాలీవుడ్ నటి, గ్లోబల్ స్టార్ ప్రియాంక చోప్రా దీపావళి పండుగను ఘనంగా జరుపుకున్నారు. తన భర్త నిక్ జొనాస్‌తో కలిసి ఫ్రెండ్స్, ఫ్యామిలీ మెంబర్స్‌తో వేడుకలను గ్రాండ్‌గా సెలబ్రేట్ చేసుకున్నారు. ఈ సందర్భంగా బుధవారం రాత్రి హాలీవుడ్ స్టార్స్, ఫ్రెండ్స్‌కు ప్రత్యేకంగా పార్టీ ఇచ్చారు. లోని జింఖానా రెస్టారెంట్‌లో వీరు తమ ఫ్రెండ్స్‌కు ఈ పార్టీ ఇచ్చినట్లు తెలుస్తోంది. ఈ సందర్భంగా పీసీ సంప్రదాయ చీర కట్టులో మెరిశారు. సబ్యసాచి డిజైన్ చేసిన రెడ్ శారీలో ఎంతో అందంగా కనిపించారు. నిక్ సైతం సంప్రదాయ కుర్తా ధరించి ఆకట్టుకున్నారు. పార్టీ సందర్భంగా తమ ఫ్రెండ్స్‌కు వీరు ఇండియన్ స్వీట్స్‌ను గిఫ్ట్‌గా అందించినట్లు తెలుస్తోంది. పీసీ దివాళీ పార్టీకి సంబంధించిన ఫొటోలు వైరల్‌గా మారాయి.

## చీరకట్టులో అదరగొట్టిన ఫరియా అబ్దుల్లా



అందాల భామ ఫరియా అబ్దుల్లా.. క్రేజ్ రోజు రోజుకు పెరిగిపోతుంది. తెలుగులో జాతిరత్నాలు సినిమాతో హీరోయిన్ గా పరిచయం అయ్యింది ఈ ముద్దుగుమ్మ. తొలిసినిమాతోనే మంచి విజయాన్ని అందుకుంది. జాతిరత్నాలు సినిమాలో అందం, అమాయకత్వం కలబోసినా పాత్రలో నటించి ఆకట్టుకుంది ఈ చిన్నది. ఆతర్వాత ఈ ముద్దుగుమ్మకు వరుస ఆఫర్స్ వచ్చాయి. అలాగే కొన్ని సినిమాల్లో చిన్న చిన్న గెస్ట్ పాత్రల్లోనూ నటించింది. అలాగే స్పెషల్ సాంగ్ కూడా చేసింది ఈ అమ్మడు. ఇక ఈ చిన్నది హీరోయిన్ గా చేసిన సినిమాలు అంతగా ఆకట్టుకోలేకపోయాయి. కానీ చివరిగా మత్తువదలరా 2 సినిమాతో హిట్ అందుకుంది ఫరియా అబ్దుల్లా. మత్తువదలరా 2 సినిమా మంచి విజయాన్ని అందుకుంది. ఈ సినిమాలో ఫరియా అబ్దుల్లా నటనతో పాటు గ్లామర్ పరంగానూ ఆకట్టుకుంది. ఈ సినిమాతోనే సింగర్ గాను మారిపోయింది ఈ వయ్యారి భామ. మత్తువదలరా 2 సినిమాలో ఓ సాంగ్ పాడింది. ఇక ఇప్పుడు బయట రాప్ సాంగ్స్ కూడా పాడుతుంది ఈ చిన్నది. ఇదిలా ఉంటే సోషల్ మీడియాలో యాక్టివ్ గా ఉండే ఈ చిన్నది.. లేటెస్ట్ గా చీరకట్టులో వయ్యారాలు

Printed published and woned by Tarigolpula Lakshmi, mahender ,printers karshak Art Printers, Hyderabad and published by office 2-6-376, Jaipuri colony,Nogole village,Uppal mandal, district Ranga Reddy,Post GSI,500068-Telangana RNI NO.APTEL/2012/46853 . Email ID : Prajaswecha@gmail.com, website, www.Prajaswecha.com cell 9381910611, 79892 89492